www.prajanaava.in
Telugu Daily
# ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పేజీలు : 08 | వెల రూ.5.00
Published from: Karimnagar, Hyderabad, Rangareddy Circulated to: Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad
కరీంనగర్ | సంపుటి 03 | సంచిక: 290 | గురువారం | 18 జూన్, 2026

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
: 99484 33277 / 9014966169



ఎల్‌నినో ఎఫెక్ట్..

## పెరుగుతున్న ఎండల తీవ్రత

- రాష్ట్రంలో మరో నాలుగు రోజులపాటు వడగాల్పులు
- రుతు పవనాలు విస్తరిస్తున్నా వర్షాలు అంతంతమాత్రమే
- ముందస్తు కార్యాచరణకు కేంద్రం ఆదేశాలు

**న్యూఢిల్లీ:** ఎల్‌నినో ప్రభావంతో దేశంలోని పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. తెలంగాణలో వచ్చే నాలుగు రోజుల పాటు తీవ్ర వడగాల్పులు వీచే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. నైరుతి రుతుపవనాలు దేశంలోని మరిన్ని ప్రాంతాలకు విస్తరిస్తున్నప్పటికీ, కనీసం మరో వారం రోజుల పాటు విస్తృత స్థాయిలో వర్షపాతం నమోదయ్యే అవకాశాలు తక్కువగా ఉన్నట్లు వాతావరణ పరిస్థితులు సూచిస్తున్నాయి. జూన్ 23 ప్రాంతంలో పరిస్థితులు మెరుగుపడే వరకు వర్షాలు అంతంతమాత్రంగానే ఉండే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. మధ్య, తూర్పు భారతదేశంలో రుతుపవనాల కదలిక కొనసాగుతున్నప్పటికీ, వర్షాలను కురిపించే వాతావరణ వ్యవస్థ అసాధారణంగా బలహీనంగా ఉందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. జూన్ 15 నుంచి 21 వరకు రుతుపవనాల కార్యకలాపాలు పెద్దగా చురుకుగా ఉండకపోవచ్చని అంచనా వేస్తున్నారు. ఫలితంగా దేశంలోని అనేక ప్రాంతాల్లో ఇప్పటికే ఏర్పడిన వర్షాభావ పరిస్థితులు మరింత కొనసాగే అవకాశముందని భావిస్తున్నారు. రానున్న రోజుల్లో విస్తృతమైన రుతుపవన వర్షాలకు బదులుగా దక్షిణ భారతదేశంలోని కొన్ని ప్రాంతాల్లో స్థానికంగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం తరువాయి 2లో




ప్రభుత్వ బడుల్లో చదవడం

# నామోషీ కాదు

ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, సీఎంలు వచ్చింది ఇక్కడినుంచే..

## మట్టిలో మాణిక్యాలను వెలికితీసేది సర్కార్ పాఠశాలలే

- కుల, మతాలకు అతీతంగా నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం
- ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి
- రంగారెడ్డి ఆరుట్లలో రూ.15 కోట్లతో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రారంభం

**ప్రజానావ, రంగారెడ్డి:** ప్రభుత్వ పాఠశాలల్లో చదవడం నామోషీ కాదని, ఆ భావన నుంచి సమాజం బయటపడాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మట్టిలో మాణిక్యాలను వెలికితీసేది ప్రభుత్వ విద్యా వ్యవస్థేనని, సమాజంలో అసమానతలను తొలగించేందుకు నాణ్యమైన విద్యే ప్రధాన సాధనమని పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా ఆరుట్లలో రూ.15 కోట్ల వ్యయంతో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను బుధవారం ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, కార్పొరేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా పేద విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్య అందించాలనే లక్ష్యంతో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారిలో ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, ముఖ్యమంత్రులు సహా ఎన్నో ప్రముఖులు ఉన్నారని గుర్తుచేశారు. విద్య ఖర్చు కాదని, అది భవిష్యత్తుపై పెట్టుబడని పేర్కొన్నారు. విద్య ద్వారానే సమాజంలో సమూల మార్పు సాధ్యమవుతుందని చెప్పారు. గత ప్రభుత్వం కులాల వారీగా పాఠశాలలను ఏర్పాటు చేసి విభజనను ప్రోత్సహించిందని సీఎం విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ తరువాయి 2లో



రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యమిస్తోంది. విద్యా వ్యవస్థలో సమగ్ర మార్పుల కోసం విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేశాం. వివిధ రాష్ట్రాలు, దేశాల విద్యా విధానాలను అధ్యయనం చేసిన అనంతరం కొత్త విధానాన్ని అమలు చేస్తున్నాం. డా.బీఆర్ అంబేద్కర్ సూచించినట్లుగా దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే నిర్మితమవుతుంది. విద్యతో పాటు క్రీడలకు కూడా సమ ప్రాధాన్యం ఇస్తున్నాం. త్వరలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ప్రారంభించుకోబోతున్నాం. 2034 నాటికి తెలంగాణ నుంచి ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకాలు సాధించే క్రీడాకారులను తయారు చేయడమే లక్ష్యం. క్రీడాకారుల్లో స్ఫూర్తిని నింపేందుకే ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీని హైదరాబాద్‌కు ఆహ్వానించాం.

– ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి





## సైబర్ నేరస్తులు పరాన్నజీవులు

- ఇలాంటి నేరాలపై మరింత కఠినంగా వ్యవహరించాలి: సుప్రీంకోర్టు
- సైబర్ మోసాల కేసులో నిందితుడికి బెయిల్ నిరాకరణ
- దేశవ్యాప్తంగా పెరుగుతున్న డిజిటల్ మోసాలపై ఆందోళన
- గతేడాది రూ.3 వేల కోట్లకు పైగా నష్టం వాటిల్లిందన్న అత్యున్నత న్యాయస్థానం

06

## టెలిగ్రామ్ నిషేధంపై రాజకీయ దుమారం

- నీట్-యూజీ రీ-ఎగ్జామ్ నేపథ్యంలో కేంద్ర నిర్ణయంపై ప్రతిపక్షాల విమర్శలు
- పేపర్ లీక్‌లను అరికట్టడంలో విఫలమై విద్యార్థులను శిక్షిస్తున్నారని ఆరోపణ
- ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన టెలిగ్రామ్
- 15 కోట్ల మంది వినియోగదారులపై ప్రభావం: పావెల్ దురోవ్

06

# హర్మూజ్‌లో ఆంక్షలుండొద్దు

## స్వేచ్ఛాయుత సముద్ర వాణిజ్యం కొనసాగాలి

- వేలాది మంది భారత నావికుల భద్రతకు ప్రాధాన్యమివ్వాలి
- భారత ప్రధాని నరేంద్ర మోదీ
- జీ7 సదస్సు సందర్భంగా ట్రంప్‌తో ద్వైపాక్షిక భేటీ
- త్వరలో భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం?
- మోదీ ప్రశాంతంగా కనిపించినా ఎంతో దృఢమైన నాయకుడు: అమెరికా అధ్యక్షుడు ట్రంప్




**ప్యారిస్:** హర్మూజ్ జలసంధిలో ఎలాంటి ఆంక్షలు లేకుండా స్వేచ్ఛాయుత సముద్ర వాణిజ్యం కొనసాగాలని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ప్రపంచవ్యాప్తంగా సముద్ర వాణిజ్య రంగంలో విధులు నిర్వహిస్తున్న వేలాది మంది భారతీయ నావికుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఫ్రాన్స్‌లో జరుగుతున్న జీ7 సదస్సు సందర్భంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ప్రధాని మోదీ ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. తరువాయి 2లో

### సమాన, స్థిరమైన ఆర్థిక వృద్ధిపై దృష్టిపెట్టాలి

- జీడీపీ గణాంకాలకు అతీతంగా వృద్ధిపై చర్చలు జరగాలి
- ఇంధన సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు అంతర్జాతీయ సహకారం అవసరం
- జీ-7 సదస్సులో మోదీ

06

- కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారు
- ఎన్నికలు ఎప్పుడొచ్చినా బీఆర్ఎస్‌దే అధికారం
- రైతులు, వ్యవసాయ రంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షోభంలోకి నెట్టింది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



# రాష్ట్రంలో సంక్షేమం లేదు

## అంతా కూల్చివేతల పాలనే నడుస్తోంది

**ప్రజానావ, ఖమ్మం:** రాష్ట్రంలో సంక్షేమ పాలన కనుమరుగై, ఎక్కడ చూసినా కూల్చివేతలే కనిపిస్తున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. తెలంగాణలో రాక్షస పాలన కొనసాగుతోందని ఆరోపించారు. ఎప్పుడైనా ఎన్నికలు జరిగినా బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని, కేసీఆర్ మరోసారి ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గంలోని వెంకటగిరిలో నిర్వహించిన బూత్ స్థాయి కార్యకర్తల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న కేటీఆర్, కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణ సాధన కోసం కేసీఆర్ ప్రాణాలకు తెగించి పోరాడారని, ఆయన పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని అన్నారు. ప్రస్తుతం ప్రజలు మళ్లీ కేసీఆర్ నాయకత్వాన్నే కోరుకుంటున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో ఉందని, రైతులకు కనీస అవసరమైన యూరియా కూడా అందని పరిస్థితి నెలకొందని కేటీఆర్ విమర్శించారు. రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తరువాయి 2లో

# కార్మికులను కలిస్తే అడ్డుకుంటారా?

- వారికి కనీస భద్రతా పరికరాలు, ప్రాథమిక సౌకర్యాలూ అందడం లేదు
- మూసివేత దిశగా వెళ్తున్న అండర్‌గ్రౌండ్ మైనింగ్‌ను పునరుద్ధరించాలి
- కేంద్ర ప్రభుత్వం సింగరేణికి మరిన్ని బొగ్గ బ్లాకులు కేటాయించాలి
- సమస్యలు పరిష్కారమయ్యే వరకూ పోరాటం కొనసాగిస్తాం
- టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత



**ప్రజానావ, గోదావరిఖని:** సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి తమ పోరాటం కొనసాగుతుందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. 'బాయిబాట' కార్యక్రమంలో భాగంగా బుధవారం గోదావరిఖనిలోని 11 ఇంక్లైన్ గనుల కార్మికులతో గేట్ మీటింగ్ నిర్వహించి వారి సమస్యలను తెలుసుకున్నారు. కార్మికులను కలిసేందుకు వచ్చిన తమను సింగరేణి యాజమాన్యం, పోలీసులు అడ్డుకోవడాన్ని ఆమె తప్పుబట్టారు. ఈ సందర్భంగా మాట్లాడిన కవిత, సింగరేణి కార్మికులకు కనీస భద్రతా పరికరాలు, ప్రాథమిక సౌకర్యాలు కూడా అందడం లేదని విమర్శించారు. గ్లౌజులు, షూస్, యంత్రాల నాణ్యత దెబ్బతిందని, తరువాయి 2లో

# గ్యాస్ వినియోగదారులకు కేంద్రం మెలిక

- 30లోగా ఈ-కేవైసీ, బయోమెట్రిక్ తప్పనిసరి
- గడువులోగా ప్రక్రియ పూర్తిచేయకపోతే సబ్సిడీ నిలిపివేత
- గ్యాస్ సరఫరా కొనసాగినా సబ్సిడీపై ప్రభావం



**న్యూఢిల్లీ:** వంటగ్యాస్ వినియోగదారులకు కేంద్రం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఉజ్వల పథకం లబ్ధిదారులతో పాటు సబ్సిడీ పొందుతున్న సాధారణ గృహోపయోగ గ్యాస్ వినియోగదారులంతా జూన్ 30లోగా ఈ-కేవైసీ, బయోమెట్రిక్ ప్రక్రియను తప్పనిసరిగా పూర్తి చేయాలని స్పష్టం చేసింది. నిర్ణీత గడువులోగా ఈ ప్రక్రియ పూర్తి చేయని వారి ఖాతాలకు సబ్సిడీ జమ కాకుండా నిలిపివేయనున్నట్లు తరువాయి 2లో

# అభిమాని కోరిక తీర్చిన పవన్ కల్యాణ్

- పాణాంతక వ్యాధితో బాధపడుతున్న నిరంజన్‌ను పరామర్శించిన ఏపీ ఉప ముఖ్యమంత్రి
- హనుమకొండలో బాలుడి ఇంటికి వెళ్లి ఆప్యాయంగా పలకరింపు
- వైద్య ఖర్చుల కోసం రూ.లక్ష ఆర్థిక సాయం
- త్వరగా కోలుకోవాలని వేంకటేశ్వరస్వామిని ప్రార్థించానన్న పవన్

**ప్రజానావ, వరంగల్:** ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న తన అభిమాని నిరంజన్ (7) కోరికను నెరవేర్చేందుకు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ బుధవారం హనుమకొండకు వచ్చారు. హనుమాన్ నగర్‌లోని నిరంజన్ నివాసానికి వెళ్లి అతడిని పరామర్శించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. వైద్య చికిత్స కోసం రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. చిన్ననాటి నుంచి పవన్ కల్యాణ్‌పై తనకు ఎంతో అభిమానం ఉందని నిరంజన్ చెప్పడంతో పవన్ భావోద్వేగానికి గురయ్యారు. బాలుడిని ఆప్యాయంగా హత్తుకుని ముద్దాడారు. ఆరోగ్యంగా ఉన్న రోజుల్లో పవన్ పాటలకు తాను చేసిన నృత్యాల వీడియోలను నిరంజన్ చూపించగా, పవన్ ఆసక్తిగా వీక్షించారు. తిరుమల నుంచి తెప్పించిన వస్త్రాన్ని నిరంజన్‌కు అందజేసిన పవన్, వరంగల్ భద్రకాళి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించిన అనంతరం వెండి ప్రతిమను నిరంజన్ తల్లిదండ్రులకు బహూకరించారు.

### బాలుడి ధైర్యం స్ఫూర్తిదాయకం

కొద్ది రోజుల క్రితం నిరంజన్ తనను కలవాలన్న ఆకాంక్షను వ్యక్తం చేసిన వీడియోను చూసినట్లు పవన్ కల్యాణ్ తెలిపారు. అనంతరం తన సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందిస్తూ, అరుదైన వ్యాధితో పోరాడుతున్న నిరంజన్ చూపుతున్న ధైర్యం, ఆత్మవిశ్వాసం, ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న తీరు ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. భగవంతుని ఆశీస్సులతో నిరంజన్ త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో చిరునవ్వులు చిందించాలని ఆకాంక్షి స్తున్నానని తెలిపారు. ప్రియమైన నిరంజన్.. నీ ధైర్యం నీ కష్టాల కంటే గొప్పది. త్వరలో నిన్ను మరింత ఉత్సాహంగా చూడాలని కోరుకుంటు న్నాను అని పవన్ పేర్కొన్నారు.

### జీవనోపాధికి తోడ్పాటుకు హామీ

సంభాషణ సందర్భంగా తనకు కుక్క పిల్లను పెంచుకోవాలని ఉందని నిరంజన్ చెప్పడంతో, దానిని కొనిపంపిస్తానని పవన్ హామీ ఇచ్చారు. ఇంటి యజమాని అనుమతి అవసరమని బాలుడి తండ్రి చెప్పడంతో, స్వయంగా ఇంటి యజమానితో మాట్లాడి అనుమతి తీసుకునేందుకు ప్రయత్నించారు. నిరంజన్ తల్లిదండ్రుల వృత్తి వివరాలు తెలుసుకున్న పవన్, వారు గతంలో కాకతీయ ఆసుపత్రి క్యాంటీన్‌లో పనిచేసేవారని తెలుసుకుని, వారి జీవనోపాధి మెరుగుపడేలా క్యాంటీన్ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని జనసేన తెలంగాణ నాయకులకు సూచించారు.

### తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు

వరంగల్ పర్యటనకు సహకరించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు శాఖకు పవన్ కల్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ప్రజలు తనపై చూపిస్తున్న ప్రేమ, ఆదరణ జీవితాంతం గుర్తుంచుకుంటానని పేర్కొన్నారు. నిరంజన్‌ను పరామర్శించిన అనంతరం పవన్ కల్యాణ్ వరంగల్ భద్రకాళి అమ్మవారి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట జనసేన నాయకులు శంకర్ గౌడ్, శ్రీరామ్ తాళ్లూరి, రాధారం రాజలింగం, ఆర్.కే. సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# జొన్న రైతు ఆత్మహత్య

- కొనుగోలు కేంద్రంలో జాప్యంతో మనస్తాపం..
- పురుగుల మందు తాగి బలవన్మరణం
- ఆదిలాబాద్ జిల్లాలో విషాదం
- అదనపు డబ్బులు ఇవ్వాలంటూ ఒత్తిడి చేశారన్న ఆరోపణలు
- ఘటనపై పోలీసులు విచారణ

**ప్రజానావ, ఆదిలాబాద్:** రైతుల ఆత్మహత్యలు ఆందోళనకరంగా కొనసాగుతున్నాయి. అప్పులు చేసి పంటలు పండించిన రైతులు సరైన సమయంలో పంటలను విక్రయించలేక, అప్పుల భారం నుంచి బయటపడే మార్గం కనిపించక బలవన్మరణాలకు పాల్పడుతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. తాజాగా ఆదిలాబాద్ జిల్లాలో ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన విషాదాన్ని మిగిల్చింది. జిల్లాలోని సిరికొండ మండలం పొన్న గ్రామానికి చెందిన నుగూరే పాండురంగ్ (48) తాను సాగు చేసిన జొన్న పంటను విక్రయించేందుకు మే 23న సిరికొండ కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లాడు. హమాలీలకు చెల్లించాల్సిన మొత్తాన్ని చెల్లించిన అనంతరం ధాన్యాన్ని లారీలో లోడ్ చేసేందుకు అదనంగా డబ్బులు ఇవ్వాలని కొనుగోలు కేంద్రం సిబ్బంది కోరినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తు న్నారు. తన వద్ద అదనపు డబ్బులు లేవని చెప్పినప్పటికీ అధికారులు స్పందించలేదని, దాదాపు పది రోజుల పాటు జొన్నలను లోడ్ చేయకుండా నిర్లక్ష్యం చేశారని తెలుస్తోంది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన పాండురంగ్ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన స్థానికంగా విషాదాన్ని నింపగా, రైతు కుటుంబ సభ్యులు కొనుగోలు కేంద్రం సిబ్బంది నిర్లక్ష్యమే ఈ విషాదానికి కారణమని ఆరోపిస్తున్నారు. ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# 'ఎస్ఐఆర్' ప్రక్రియపై అప్రమత్తంగా ఉండాలి

**ప్రజానావ, హైదరాబాద్:** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ముస్లింల ఓట్లను లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉందని రాష్ట్ర మంత్రి అజారుద్దీన్ ఆందోళన వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్, బిహార్ రాష్ట్రాల్లో ముస్లింల ఓట్ల తొలగింపు కారణంగానే బీజేపీ అధికారంలోకి వచ్చిందని ఆరోపించిన ఆయన, తెలంగాణలోనూ అలాంటి ప్రయత్నాలు జరిగే అవకాశం ఉందని అన్నారు. బుధవారం గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడిన మంత్రి అజారుద్దీన్, ఎస్ఐఆర్ ప్రక్రియ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును కాపాడుకునే బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ ప్రక్రియలో తొలగించే ఓట్లు ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని పేర్కొన్నారు. తాను ఎప్పుడూ నిజాయితీగా మాట్లాడుతానని చెప్పిన మంత్రి, తనకు తెలుగు చదవడం, రాయడం వచ్చని, అయితే తెలుగులో మాట్లాడేటప్పుడు కొంత ఇబ్బంది ఎదురవుతుందని తెలిపారు. చిన్నతనంలో తెలుగు చదవడం, రాయడం అభ్యసించానని, తప్పులు వస్తాయేమోనన్న సంకోచంతో కొన్ని సందర్భాల్లో తనకు సౌకర్యంగా ఉండే భాషలో మాట్లాడుతానని వివరించారు. ప్రతిపక్షాలు తమ ప్రభుత్వంపై అనవసర విమర్శలు చేస్తున్నాయని ఆరోపించిన మంత్రి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో సమర్థవంతమైన పాలన కొనసాగుతోందని అన్నారు. విద్యా రంగంపై సీఎం ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని, గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రస్తుత ప్రభుత్వం చెల్లిస్తోందని తెలిపారు. మంత్రి పదవి చేపట్టిన తర్వాత అనేక మంది పేదలకు సహాయం చేశానని, ప్రజల నుంచి వచ్చిన సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తున్నానని అజారుద్దీన్ చెప్పారు.

# రూ.2వేల కోట్ల స్కాం ఎక్కడ జరిగింది?

- సంక్షేమ శాఖల టెండర్ల విలువే అంత లేనప్పుడు కుంభకోణం ఎలా సాధ్యం?
- ఆధారాలు ఉంటే నిరూపించాలి.. ప్రభుత్వం దేనికైనా సిద్ధం
- హరీశ్‌రావు ఆరోపణలు నిరాధారం
- మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజానావ, హైదరాబాద్: తెలంగాణ గురుకుల పాఠశాలలకు సంబంధించిన టెండర్లలో రూ.2 వేల కోట్ల భారీ కుంభకోణం జరిగిందంటూ బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు చేసిన ఆరోపణలపై రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా స్పందించారు. సంక్షేమ శాఖల్లో మొత్తం టెండర్ల విలువే రూ.2 వేల కోట్లు లేనప్పుడు, అంత మొత్తం లో అవినీతి జరిగిందని ఎలా ఆరోపిస్తారని ప్రశ్నిం చారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలు పూర్తిగా నిరాధారమైనవని పేర్కొన్నారు. ఆరోపణలకు తగి న ఆధారాలు ఉంటే వాటిని బహిర్గతం చేయాలని, వాటిని నిరూపించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేస్తున్న సంక్షేమ శాఖలపై అసత్య ప్రచారం చేయడం సరికాదని మంత్రి అన్నారు. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. అలాంటి వర్గాల అభివృద్ధిని దెబ్బతీ సేలా ఆరోపణ లు చేయడం బాధ్యతారాహిత్యమని వ్యాఖ్యానించారు.

### వాస్తవాలను మాట్లాడాలి

ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను తెలంగాణ సమాజం గమనిస్తోందని, ఆధారాలు లేని ఆరోపణలతో రాజకీయ లబ్ధి పొందాలని చూడటం సరికాదని పొన్నం ప్రభాకర్ అన్నారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న నాయకులు వాస్తవాలను పరిగణనలోకి తీసుకుని మాట్లాడాలని సూచించారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను ప్రస్తావించిన మంత్రి, బీజేపీ వ్యతిరేక ఓట్లను తొలగించాలనే ఉద్దేశంతోనే ప్రత్యేక సవరణ ప్రక్రియను తీసుకొచ్చారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని వ్యాఖ్యానించారు.

# కార్మికులను కలిస్తే అడ్డుకుంటారా?

(మొదటిపేజీ తరువాయి)

గనుల్లో పని చేసే కార్మికులకు అవసరమైన వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. కార్మికుల హక్కుల కోసం తెలంగాణ రక్షణ సేన, హెచ్ఎంఎస్ యూనియన్ కలిసి పోరాటం చేస్తాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మూసివేత దిశగా వెళ్తున్న అండర్‌గ్రౌండ్ మైనింగ్‌ను పునరుద్ధరించాలని, కేంద్ర ప్రభుత్వం సింగరేణికి మరిన్ని బొగ్గు బ్లాకులు కేటాయించాలని ఆమె డిమాండ్ చేశారు. సింగరేణి మెడికల్ కాలేజీలో కార్మికుల పిల్లలకు తగిన ప్రాధాన్యం కల్పించాలని కోరారు.

### ఎయిమ్స్ తరహా ఆస్పత్రి అవసరం

అనంతరం ఆర్జీ-1 సింగరేణి ఏరియా ఆస్పత్రిని సందర్శించిన కవిత, చికిత్స పొందుతున్న రోగులు, వైద్య సిబ్బందితో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. సింగరేణికి ఎయిమ్స్ తరహా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అవసరమని పేర్కొన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు, నర్సింగ్ సిబ్బంది ప్రమోషన్లు, రిఫరల్ ఆస్పత్రుల్లో కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సింగరేణి కాలనీల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, రూ.20 కోట్లతో చేపట్టిన రాపిడ్ ఫిల్టర్ బెడ్ పనులను వెంటనే పూర్తి చేసి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని కల్వకుంట్ల కవిత కోరారు. సింగరేణి కార్మికులు, వారి కుటుంబాల సంక్షేమం కోసం తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని ఆమె స్పష్టం చేశారు.

# రెండో విడతలో 2.50 లక్షల ఇళ్ల నిర్మాణం

- ఇందిరమ్మ ఇళ్ల రెండో విడతలో గుడిసెవాసులకే తొలి ప్రాధాన్యం
- ప్రతి నియోజకవర్గంలో 2 వేల ఇళ్లు.. రూఫ్ రీప్లేస్‌మెంట్ పథకానికి ప్రత్యేక ప్రాధాన్యం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం

**ప్రజానావ, హైదరాబాద్:** ఇందిరమ్మ ఇళ్ల రెండో విడతలో గుడిసెవాసులకు తొలి ప్రాధాన్యం కల్పిస్తామని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా గుడిసెల గుర్తింపునకు ప్రత్యేక సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశిం చారు. అర్హుల ఎంపికను పూర్తిస్థాయి పార దర్శక తతో చేపడతామని తెలిపారు. బుధవారం హైదరా బాద్‌లో గృహ నిర్మాణ శాఖ ఉన్నతాధికా రులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా గుడిసెల్లో నివసిస్తున్న వారి నుంచి వచ్చిన సుమారు 75 వేల దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇప్పటివరకు దరఖాస్తు చేయని గుడిసెవాసులకు మరో అవకాశం కల్పించనున్నట్లు వెల్లడించారు. రెండో విడతలో రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని చేపడతామని మంత్రి చెప్పారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 2 వేల ఇళ్ల చొప్పున నిర్మించనున్నట్లు వివరించారు. ప్రమాదకర స్థితిలో ఉన్న ఇంటి పైకప్పుల మార్పునకు ప్రభుత్వం ప్రత్యేక పథకాన్ని అమలు చేయనున్నట్లు పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ పథకం కింద ప్రతి నియోజక వర్గంలో 500 ఇళ్లకు లబ్ధి చేకూర్చేలా చర్యలు తీసుకుంటామని, రాష్ట్రవ్యాప్తంగా సుమారు 50 వేల కుటుంబాలు ప్రయోజనం పొందనున్నాయని చెప్పారు. ప్రమాదకర పైకప్పుల మార్పునకు ఒక్కో ఇంటికి రూ.2 లక్షల వరకు ఆర్థిక సహాయం అందజేస్తామని వెల్లడించారు. అసంపూర్తిగా నిలిచి పోయిన ఇళ్లను కూడా ఈ పథకం పరిధిలోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఇంటి నిర్మాణంలో లబ్ధిదారుడే ప్రధాన నిర్మాణదారుడిగా వ్యవహరించేలా బెనిఫిషియరీ లెడ్ కన్స్ట్రక్షన్ (బీఎల్‌సీ) విధానాన్ని అమలు చేస్తామని మంత్రి పేర్కొన్నారు. పట్టణ ప్రాంతాల్లో అవసరాన్ని బట్టి జీ ప్లస్-1 నిర్మాణాలకు కూడా అనుమతి ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

# హర్మూజ్‌లో ఆంక్షలుండొద్దు

(మొదటిపేజీ తరువాయి)

ఈ సందర్భంగా ఇరు దేశాలకు సంబంధించిన కీలక అంశాలతో పాటు పశ్చిమాసియా పరిస్థితులపై కూడా చర్చించారు. పశ్చిమాసియాలో శాంతి స్థాపన కోసం ట్రంప్ చేస్తున్న కృషిని ప్రధా ని మోదీ అభినందించారు. హర్మూజ్ జలసంధి తెరిచి ఉండటం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు మేలు చేస్తుందని పేర్కొన్నారు. భారత్-అమెరికా మధ్య త్వరలో వాణిజ్య ఒప్పందం కుదిరే అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. ఈ సందర్భంగా ట్రంప్‌తో జరిగిన సంభాషణలో మోదీ మాట్లాడుతూ, ప్రపంచానికి హర్మూజ్ జలసంధి తెరిచి ఉండటం అత్యంత అవసరం. సముద్రయాన స్వేచ్ఛను పరిరక్షించడంపై మేము ఎప్పటి నుంచో ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా సముద్ర మార్గాల్లో వేలాది మంది భారతీయ నావికులు పనిచేస్తున్నారు. వారి భద్రతకు తగిన ప్రాధాన్యం లభిస్తుందనే నమ్మకం ఉంది అని పేర్కొన్నారు. అనంతరం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ, ఫ్రాన్స్‌లో జరిగిన సమావేశాలు ఎంతో ఫలవంతంగా సాగాయని చెప్పారు. ముఖ్యంగా ప్రధాని మోదీతో చాలా మంచి చర్చలు జరిగాయని పేర్కొన్నారు. భారత్‌తో వాణిజ్య ఒప్పందాల దిశగా పురోగతి కొనసాగుతోందని తెలిపారు. మోదీ నాకు చాలా కాలంగా మంచి మిత్రుడు. మా ఇద్దరి మధ్య ఎప్పుడూ సత్సంబంధాలే ఉన్నాయి. భారతదేశం పట్ల నాకు ఎంతో గౌరవం ఉంది. మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచవ్యాప్తంగా కీలక పాత్ర పోషించనుంది. ఆయన ప్రశాంతంగా కనిపించినప్పటికీ ఎంతో దృఢమైన వ్యక్తి అని ట్రంప్ ప్రశంసించారు. అమెరికాలో భారత పెట్టుబడులు పెరుగుతున్నాయని, మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భారత్ కీలక పాత్ర పోషిస్తోందని ట్రంప్ పేర్కొన్నారు. ఈ కృషిని అమెరికా ప్రభుత్వం అభినందిస్తోందని తెలిపారు.

# గ్యాస్ వినియోగదారులకు కేంద్రం మెలిక

(మొదటిపేజీ తరువాయి)

వెల్లడించింది. గత ఏడాది నుంచి ఈ-కేవైసీ ప్రక్రియ కొనసాగుతున్నప్పటికీ, ఇంకా పెద్ద సంఖ్యలో వినియోగదారులు బయోమెట్రిక్ ధ్రువీకరణ పూర్తి చేయకపోవడంతో కేంద్రం మరోసారి గడువు నిర్దేశించింది. ఒకవేళ జూన్ 30 తర్వాత బయోమెట్రిక్ ప్రక్రియ పూర్తి చేసుకున్నా, ఆ తేదీ తర్వాత కొనుగోలు చేసే సిలిండర్లకు మాత్రమే సబ్సిడీ వర్తిస్తుందని పేర్కొంది. గడువు ముగిసిన తర్వాత నుంచి బయోమెట్రిక్ పూర్తయ్యే వరకు తీసుకునే సిలిండర్లపై సబ్సిడీ కోల్పోవాల్సి ఉంటుందని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ జారీ చేసిన సర్క్యులర్‌లో స్పష్టం చేసింది. అయితే బయోమెట్రిక్ పూర్తి కాలేదనే కారణంతో గ్యాస్ సిలిండర్ల సరఫరాను ఎట్టి పరిస్థితుల్లోనూ నిలిపివేయరాదని మే 18న కేంద్రం స్పష్టం చేసింది. అయినప్పటికీ, క్షేత్రస్థాయిలో బయోమెట్రిక్ పూర్తి చేయని వినియోగదారులకు సిలిండర్ల డెలివరీ ఆలస్యం చేయాలని లేదా పరిమితం చేయాలని ఆయిల్ కంపెనీల నుంచి అనధికారిక సూచనలు వెళ్లినట్లు సమాచారం. పశ్చిమాసియా ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ఇంధన ధరలు పెరగడంతో ఇటీవల గృహోపయోగ సిలిండర్ ధరను రూ.29 మేర పెంచారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో సబ్సిడీ లేని గృహోపయోగ ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ.994గా ఉంది. ఉజ్వల పథకం కింద కేంద్ర ప్రభుత్వం ఒక్కో సిలిండర్‌పై రూ.300 సబ్సిడీ అందిస్తుండగా, ఇతర అర్హులైన వినియోగదారుల బ్యాంకు ఖాతాల్లో స్వల్ప మొత్తంలో సబ్సిడీ జమవుతోంది. మరోవైపు తెలంగాణ ప్రభుత్వం అర్హులైన కుటుంబాలకు రూ.500కే గ్యాస్ సిలిండర్‌ను అందిస్తోంది.

### గ్యాస్ ఏజెన్సీలను సంప్రదించాలి

కేంద్ర మార్గదర్శకాల ప్రకారం ఇండియన్ ఆయిల్, భారత్ పెట్రోలియం, హిందుస్తాన్ పెట్రోలియం సంస్థలు బయోమెట్రిక్ ధ్రువీకరణ పూర్తి చేయని వినియోగదారుల వివరాలను రాష్ట్ర ప్రభుత్వాలతో పంచుకోనున్నాయి. గ్యాస్ కనెక్షన్ తీసుకున్నప్పటి నుంచి ఇప్పటివరకు ఒక్కసారి కూడా బయోమెట్రిక్ అప్‌డేట్ చేయని వారు వెంటనే తమ గ్యాస్ ఏజెన్సీని సంప్రదించి ప్రక్రియను పూర్తి చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. గ్యాస్ కనెక్షన్లను ఆధార్‌తో అనుసంధానం చేయడంతో పాటు ముఖ గుర్తింపు, వేలిముద్రలు లేదా ఐరిస్ స్కాన్ ద్వారా ఈ-కేవైసీ ప్రక్రియ నిర్వహిస్తున్నారు. వినియోగదారులు ఆయిల్ కంపెనీల మొబైల్ యాప్‌ల ద్వారా స్వయంగా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవచ్చు. అలాగే గ్యాస్ ఏజెన్సీల వద్ద కూడా ఈ సదుపాయం అందుబాటులో ఉంది. కొన్ని ప్రాంతాల్లో సిలిండర్ డెలివరీ సమయంలోనే బయోమెట్రిక్ ధ్రువీకరణ ప్రక్రియను నిర్వహిస్తున్నారు. జూన్ 30లోగా ఈ ప్రక్రియను పూర్తి చేసుకుంటేనే ఎలాంటి అంతరాయం లేకుండా సబ్సిడీ మొత్తాలు నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయని కేంద్రం స్పష్టం చేసింది.

# ప్రభుత్వ పాఠశాలల్లో చదవడం నామోషీ కాదు

(మొదటిపేజీ తరువాయి)

అనే భేదాలు లేకుండా అన్ని వర్గాల పిల్లలు కలిసి చదివేలా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను నిర్మిస్తున్నామని తెలిపారు. కుల గోడలను కూల్చి సమానత్వాన్ని పెంపొందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆరుట్ల పాఠశాలను పైలట్ ప్రాజెక్టుగా అభివృద్ధి చేశామని, ఇదే నమూనాను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించనున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే ఈ పాఠశాలలో 1,814 మంది విద్యార్థులు చేరారని, భారీగా దరఖాస్తులు రావడంతో అడ్మిషన్లు నిలిపివేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ విజయానికి ఉపాధ్యాయుల కృషే కారణమని ప్రశంసించారు.

### విద్యా రంగానికి ప్రాధాన్యం

రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని సీఎం చెప్పారు. విద్యా వ్యవస్థలో సమగ్ర మార్పుల కోసం విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. వివిధ రాష్ట్రాలు, దేశాల విద్యా విధానాలను అధ్యయనం చేసిన అనంతరం కొత్త విధానాన్ని అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సూచించినట్లుగా దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే నిర్మితమవుతుందని పేర్కొన్నారు. విద్యతో పాటు క్రీడలకు కూడా ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని రేవంత్ రెడ్డి తెలిపారు. త్వరలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. 2034 నాటికి తెలంగాణ నుంచి ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకాలు సాధించే క్రీడాకారులను తయారు చేయడమే లక్ష్యమని చెప్పారు. క్రీడాకారుల్లో స్ఫూర్తిని నింపేందుకే ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీని హైదరాబాద్‌కు ఆహ్వానించినట్లు వివరించారు.

### ఆరోపణలపై సీఎం స్పందన

విద్యార్థులకు నాణ్యమైన విద్యా కిట్ల పంపిణీ కోసం రూ.680 కోట్లతో టెండర్లు నిర్వహించామని, ఇందులో రూ.2 వేల కోట్ల అవినీతి జరిగిందంటూ కొందరు చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని సీఎం అన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా విమర్శలు చేయడం బాధాకరమని పేర్కొన్నారు. ఇదిలాఉంటే రాష్ట్ర యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ నెల 19న హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో గవర్నర్ సమక్షంలో డ్రగ్స్, గంజాయికి వ్యతిరేకంగా భారీ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

### విద్యార్థులతో కలిసి అల్పాహారం

ప్రారంభోత్సవం అనంతరం సీఎం రేవంత్ రెడ్డి విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. పాఠశాల లైబ్రరీ, డిజిటల్ తరగతి గదులు, ఇన్నోవేషన్ ల్యాబ్, ఫిజిక్స్, బాటనీ, కెమిస్ట్రీ ల్యాబ్‌లు, డ్యాన్స్, మ్యూజిక్ విభాగాలను పరిశీలించారు. పాఠశాల ప్రాంగణంలో మొక్క నాటి, ఫుట్‌బాల్ మైదానంలో విద్యార్థులతో కలిసి ఫుట్‌బాల్ ఆడారు. కిచెన్‌ను సందర్శించి అక్కడ తయారవుతున్న ఆహారాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆస్పత్రిలో విషాదం

- ప్రసవం చేసిన నర్సు.. తల్లీబిడ్డల మృతి
- భద్రాద్రి జిల్లాలో ఘటన
- వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ కుటుంబ సభ్యుల ఆరోపణ
- ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

**ప్రజానావ, భద్రాద్రి కొత్తగూడెం:** జిల్లాలోని గుండాల ప్రభుత్వ ఆస్పత్రిలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ఓ నర్సు ప్రసవం చేయడంతో తల్లీ బిడ్డలు మృతి చెందడం తీవ్ర కలకలం రేపింది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే ఈ విషాదం చోటుచేసుకుందని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. గుండాల మండలం శంభుని గూడెం గ్రామానికి చెందిన వనజ (20)కు పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు ఆమెను గుండాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే ఆ సమయంలో ఆస్పత్రిలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో అక్కడ విధుల్లో ఉన్న నర్సు సాధారణ ప్రసవం నిర్వహించింది. ప్రసవం అనంతరం నవజాత శిశువు అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ శిశువును పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మరోవైపు ప్రసవం తర్వాత వనజకు తీవ్ర రక్తస్రావం కావడంతో ఆమెను మెరుగైన చికిత్స కోసం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ ఆమె కూడా మృతి చెందింది. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తమ కుమార్తె, మనవడు ప్రాణాలు కోల్పోయారని ఆరోపించారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# పెరుగుతున్న ఎండల తీవ్రత

(మొదటిపేజీ తరువాయి)

ఉంది. ముఖ్యంగా కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు సరిహద్దు ప్రాంతాలు, తూర్పు కనుమల పరిసరాల్లో తరచుగా ఉరుములు, ఈదురు గాలులతో కూడిన వాతావరణం నెలకొనవచ్చని అంచనా. ఈ ప్రాంతాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది.

### ఖరీఫ్‌పై ప్రభావం

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 9 నుంచి 10 రాష్ట్రాలపై ఎల్‌నినో తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. ప్రభావిత రాష్ట్రాల్లోని జిల్లా అధికారులు, వ్యవసాయ శాఖలతో సమన్వయ సమావేశాలు నిర్వహించాలని ఆయన ఆదేశించారు. వర్షపాతం తక్కువగా నమోదవుతున్న జిల్లాల కోసం ముందస్తు అత్యవసర కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని, పత్తి, పప్పుధాన్యాల సాగు విస్తీర్ణాన్ని పెంచే దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులకు శాస్త్రీయ సలహాలు, పంటల నిర్వహణపై అవగాహన కల్పించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. ఖరీఫ్-2026 సన్నాహకాలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడిన కేంద్ర మంత్రి, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికల అమలుకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

# రాష్ట్రంలో సంక్షేమం లేదు

(మొదటిపేజీ తరువాయి)

రెండున్నరేళ్ల కాలంలో భారీగా అప్పులు చేసినప్పటికీ అభివృద్ధి కనిపించడం లేదని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో చేసిన అప్పులు రాష్ట్ర అభివృద్ధి, కాళేశ్వరం ప్రాజెక్టు, భక్తరామదాసు ప్రాజెక్టు, ప్రజా సంక్షేమ కార్యక్రమాల కోసం వినియోగించామని చెప్పారు. పేద విద్యార్థుల కోసం మెడికల్, నర్సింగ్ కళాశాలలను ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తుచేశారు.

### ముగ్గురు మంత్రులు ఉన్నా ప్రయోజనం లేదు

ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు ప్రభుత్వంలో ఉన్నప్పటికీ జిల్లా అభివృద్ధికి ఒరిగిందేమీ లేదని కేటీఆర్ విమర్శించారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం మాత్రమే పాలన సాగుతోందని ఆరోపించారు. ఒక మంత్రి భూదందాలకు పాల్పడుతున్నారని, మరో మంత్రి వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టారని, ఆర్థిక మంత్రి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అస్తవ్యస్తం చేశారని వ్యాఖ్యానించారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భూ ఆక్రమణలకు పాల్పడుతున్నారని ఆరోపించిన కేటీఆర్, ఇందుకు సంబంధించిన వీడియోలను సభా వేదికపై ప్రదర్శించారు.

**ఎస్ఐఆర్‌పై అప్రమత్తంగా ఉండాలి**

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో పార్టీ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని కేటీఆర్ సూచించారు. అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించకుండా ప్రతి బూత్ స్థాయిలో జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ నెల 25 నుంచి వచ్చే నెల 25 వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. ప్రతి బూత్‌లో పార్టీ కార్యకర్తలు చురుకుగా పనిచేయాలని, ఒక్క ఓటు కూడా కోల్పోకుండా చూసుకోవాలని సూచించారు. ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిగితే బీఆర్ఎస్‌కు వంద స్థానాలు వస్తాయని, అందుకోసం ప్రతి కార్యకర్త అప్రమత్తంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో యువత క్రియాశీలక పాత్ర పోషించాలని సూచించారు. ఖమ్మం జిల్లా పర్యటనకు వచ్చిన కేటీఆర్‌కు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు తక్కళ్లపల్లి రవీందర్‌రావు, తాతా మధుసూదన్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# శ్రీశైలం, జూరాలలకు స్వల్ప వరద

**కృష్ణా ఎగువ ప్రాంతాల్లో వర్షాల ప్రభావం.. ప్రాజెక్టుల్లోకి చేరుతున్న నీరు**

**ప్రజానావ, నాగర్‌కర్నూల్ :** కృష్ణానది ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల ప్రభావంతో బుధవారం శ్రీశైలం, జూరాల ప్రాజెక్టులకు స్వల్పంగా వరద ప్రవాహం కొనసాగింది. ప్రాజెక్టు అధికారుల వివరాల ప్రకారం, కృష్ణానదిపై నిర్మించిన నీలం సంజీవరెడ్డి శ్రీశైలం జలాశయానికి 6,710 క్యూసెక్కుల వరద నీరు చేరుతోంది. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం నీటిమట్టం 821.20 అడుగులుగా నమోదైంది. గరిష్ట నిల్వ సామర్థ్యం 215.8070 టీఎంసీలు, ప్రస్తుతం 41.6978 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అదే విధం గా కృష్ణా నదిపై నిర్మించిన ప్రియదర్శిని జూ రాల ప్రాజెక్టుకు 1,999 క్యూసెక్కుల వరద నీరు చేరు తోంది. జూరాల ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమ ట్టం 1,045 అడుగులు కాగా, ప్రస్తుతం 1,041. 40 అడుగులుగా నమోదైంది. గరిష్ట నీటి నిల్వ సామ ర్థ్యం 9.657 టీఎంసీలు, ప్రస్తుతం 3.791 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రస్తుతం జూరాల ప్రాజెక్టు నుంచి నెట్టెంపాడు ఎత్తిపోతల పథకానికి 1,500 క్యూసెక్కులు, భీమా ఎత్తిపోతల పథకానికి 1,300 క్యూసెక్కుల నీటిని విడుదలచేస్తున్నట్లు అధికారులు తెలిపారు. కృష్ణా పరీవాహక ప్రాంతా ల్లో వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రాజెక్టు ల్లోకి నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు.

# సోలార్ ప్లాంట్లతో భారీ ఆదాయం

- కేంద్ర మంత్రి బండి సంజయ్
- 1% మెగావాట్ సోలార్ ప్లాంట్‌తో ఏటా రూ.50 లక్షల వరకు ఆదాయం
- నాబార్డు ద్వారా తక్కువ వడ్డీకే రుణ సౌకర్యం
- జన ఔషధి కేంద్రాల సేవలను ప్రజలు వినియోగించుకోవాలి



**ప్రజానావ, చొప్పదండి:** సహకార సంఘాలు సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకుంటే స్థిరమైన ఆదాయ వనరులు సమకూర్చుకోవచ్చని కేంద్ర మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. ఒక మెగా వాట్ సామర్థ్యంతో ఏర్పాటు చేసే సోలార్ ప్లాంట్ ద్వారా ఏటా సుమారు రూ.50 లక్షల ఆదాయం పొందే అవకాశం ఉందని తెలిపారు. ప్లాంట్ల ఏర్పాటుకు నాబార్డు ద్వారా రుణ సౌకర్యం కల్పిస్తున్నామని, సక్రమంగా ఈఎంఐలు చెల్లించే సహకార సంఘాలకు కేవలం 1 శాతం వడ్డీకే రుణం లభించే అవకాశం ఉందని వెల్లడించారు. బుధవారం చొప్పదండి పర్యటనలో భాగంగా బండి సంజయ్ స్థానిక జన ఔషధి కేంద్రాన్ని సందర్శించి అక్కడ అందుతున్న సేవలపై ఆరా తీశారు. నాణ్యమైన మందులు తక్కువ ధరలకు లభించే జన ఔషధి కేంద్రాలను ప్రజలు విస్తృతంగా వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం చొప్పదండి శివారులో ఏర్పాటు చేసిన సోలార్ ప్లాంట్‌ను సందర్శించి దాని నిర్మాణ వ్యయం, రుణ సదుపాయాలు, విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం తదితర వివరాలను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రధానమంత్రి కుసుం పథకం కింద కేంద్ర ప్రభుత్వం సోలార్ విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తోందన్నారు. ఒక మెగావాట్ సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు సుమారు రూ.3.80 కోట్ల వ్యయం అవుతుందని, ఇందులో సహకార సంఘం రూ.40 లక్షలు సమకూర్చగా, మిగిలిన రూ.3.40 కోట్లను నాబార్డు రుణంగా అందిస్తుందని వివరించారు. రుణంపై 4 శాతం వడ్డీ ఉంటుందని, ఈఎంఐలు సక్రమంగా చెల్లిస్తే 3 శాతం వడ్డీ రాయితీ లభిస్తుందని చెప్పారు. సోలార్ ప్లాంట్ ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను డిస్కంలు యూనిట్‌కు రూ.3 చొప్పున కొనుగోలు చేస్తాయని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటివరకు ఐదు సోలార్ ప్లాంట్లు మాత్రమే ఏర్పాటు కాగా, కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో తొలి ప్లాంట్ చొప్పదండిలో ఏర్పాటు కావడం అభినందనీయమన్నారు. సహకార సంఘాలే కాకుండా వ్యక్తిగతంగా కూడా సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉందని, ఇందుకు 9 శాతం వడ్డీతో రుణాలు లభిస్తాయని చెప్పారు. సకాలంలో రుణ చెల్లింపులు చేస్తే 3 శాతం వడ్డీ రాయితీ వర్తిస్తుందని వివరించారు. ఒక మెగావాట్ సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు సుమారు మూడు ఎకరాల భూమి అవసరమని, భూమి అందుబాటులో ఉన్న రైతులు, సంస్థలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా సహకార సంఘాలు సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు ముందుకు రావాలని, కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందని బండి సంజయ్ స్పష్టం చేశారు.

## విద్యుదాఘాతానికి గురై కూలీ మృతి

- అల్వాల్‌లో విషాదం

**ప్రజానావ, హైదరాబాద్:** నగరంలోని అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎంఈఎస్ కాలనీలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. అపార్ట్‌మెంట్ ముందు ఉన్న చెట్టు కొమ్మలను నరుకుతున్న సమయంలో విద్యుత్ తీగలు తగలడంతో ఓ దినసరి కూలీ విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, సూర్యనారాయణ (45) అనే వ్యక్తి చెట్టు కొమ్మలను తొలగించే పనిలో ఉండగా ప్రమాదవశాత్తూ విద్యుత్ సరఫరా అవుతున్న తీగలు తగిలాయి. దీంతో ఆయన తీవ్ర విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సూర్యనారాయణ రోజువారీ కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఆయనకు భార్యతో పాటు ముగ్గురు కుమారులు ఉన్నారు. కుటుంబానికి ప్రధాన ఆధారంగా ఉన్న వ్యక్తి ఆకస్మికంగా మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. సమాచారం అందుకున్న అల్వాల్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృ దేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించి, దర్యాప్తు చేపట్టారు.

# నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం

- 220 దుకాణాల తనిఖీ
- 18 మందిపై 7 కేసులు నమోదు
- రూ.10.20 లక్షల విలువైన పత్తి విత్తన ప్యాకెట్లు స్వాధీనం

**ప్రజానావ, ఆదిలాబాద్:** ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో రైతులను నకిలీ, నాణ్యతలేని, నిషేధిత విత్తనాల మోసం నుంచి రక్షించేందుకు జిల్లా యంత్రాంగం కఠిన చర్యలు చేపట్టిందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. రైతులను మోసగించే వారిపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్ష ఉండదని స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని మండలాల్లో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలు ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నాయని, ఇప్పటివరకు 220 విత్తనాలు, ఎరువుల విక్రయ కేంద్రాలను తనిఖీ చేసినట్లు వెల్లడించారు. నకిలీ లేబుళ్లు, బ్యాచ్ నంబర్లు లేకుండా విక్రయాలు జరపడం, నిషేధిత, అనధికారిక విత్తనాల విక్రయాలకు పాల్పడిన 18 మందిపై 7 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో రూ.10.20 లక్షల విలువైన 1,181 పత్తి విత్తన ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, నమూనాలను పరీక్షల కోసం ప్రయోగశాలకు పంపినట్లు పేర్కొన్నారు. విత్తనాల చట్టం–



1966, నిత్యావసర వస్తువుల చట్టం–1955 కింద సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వ్యవసాయ శాఖ విత్తన పరిశీలకులు ఇప్పటివరకు 86 నమూనాలను పరీక్షల కోసం పంపినట్లు వెల్లడించారు. సబ్సిడీ ఎరువులతో ఇతర ఉత్పత్తులను లింక్ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్న ఇంద్రవెల్లి మండలంలోని డీలర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన డీలర్ల లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు. ప్రతి విక్రయానికి సంబంధించిన లాట్ నంబర్, గడువు తేదీ, విత్తన రకం వివరాలతో కూడిన బిల్లును రైతులకు తప్పనిసరిగా అందజేయాలని ఆదేశించారు. అలాగే ప్రభుత్వం నిర్ణయించిన ధరలు, అందుబాటులో ఉన్న నిల్వల వివరాలను దుకాణాల వద్ద ప్రదర్శించాలని సూచించారు. రైతులు లైసెన్స్ పొందిన దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలని, తక్కువ ధరలకు విక్రయిస్తామంటూ మోసగించే వ్యక్తులను నమ్మవద్దని కలెక్టర్ సూచించారు. కొనుగోలు చేసిన బిల్లులు, విత్తన సంచులు, ట్యాగ్‌లను పంట కోత వరకు భద్రపరచుకోవాలని తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేని హెచ్‌టీవీ (బీటీ–3) పత్తి విత్తనాల వినియోగం చట్టరీత్యా నేరమని, ధృవీకరించిన బీటీ పత్తి విత్తనాలను మాత్రమే వినియోగించాలని రైతులకు సూచించారు. జిల్లాలో ప్రస్తుతం 7,35,140 పత్తి విత్తన ప్యాకెట్లు, 3,244 టన్నుల సోయాబీన్ విత్తనాలు, 210 టన్నుల కంది విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతుల అవసరాలకు సరిపడా నిల్వలు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. నకిలీ లేదా నిషేధిత విత్తనాలపై సమాచారం ఉంటే 8977742856 నంబర్‌కు లేదా సమీప వ్యవసాయ అధికారులకు వెంటనే తెలియజేయాలని రైతులకు తెలిపారు.



## ప్రయాణికుల సౌకర్యాల మెరుగుదలకు ముందడుగు

- ఎన్‌టీపీసీ సీఎస్ఆర్ నిధులతో బస్టాండ్, రైల్వే స్టేషన్‌లలో సౌకర్యాల విస్తరణ
- గోదావరిఖని ఆర్టీసీ డిపో, రామగుండం రైల్వే స్టేషన్‌కు బెంచీలు, వాటర్ కూలర్ల అందజేత

**ప్రజానావ, రామగుండం :** ఎన్‌టీపీసీ రామగుండం తన కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమాల్లో భాగంగా ప్రజా రవాణా సౌకర్యాల అభివృద్ధికి మరో అడుగు వేసింది. ప్రయాణికులకు మెరుగైన సౌక ర్యాలు కల్పించాలనే లక్ష్యంతో బుధవారం గోదావరిఖని ఆర్టీసీ డిపో, రామ గుండం రైల్వే స్టేషన్‌లకు పలు సదుపాయాలను అందజేసింది. ఈ కార్యక్రమం కింద తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ) గోదావరిఖని డిపోకు స్టెయిన్‌లెస్ స్టీల్ 3–సీటర్ బెంచీలు, వాటర్ కూలర్లను ఎన్‌టీపీసీ అధికారులు డిపో మేనేజర్‌కు అందజేశారు. అదే విధంగా దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని రామగుండం రైల్వే స్టేషన్‌కు నాలుగు స్టెయిన్‌లెస్ స్టీల్ 3–సీటర్ బెంచీలు, వాటర్ కూలర్లను స్టేషన్ అధికారులకు అందించారు. ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన ఈ సదుపాయాలు బస్టాండ్, రైల్వే స్టేషన్‌లలో ప్రజా మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు, ప్రయాణ సమయంలో మరింత సౌకర్యవంతమైన వాతావరణాన్ని కల్పించనున్నాయి. ఈ హస్తాంతరణ కార్యక్రమంలో ఎన్‌టీపీసీ రామగుండం, టీఎస్ఆర్టీసీ, దక్షిణ మధ్య రైల్వేకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సీఎస్ఆర్ కార్యక్రమాల ద్వారా సమాజ సంక్షేమం, ప్రజా సౌకర్యాల అభివృద్ధికి ఎన్‌టీపీసీ రామగుండం నిరంతరం కృషి చేస్తోందని, పరిసర ప్రాంతాల ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు తన నిబద్ధతను మరోసారి చాటుకుందని అధికారులు పేర్కొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ఉక్కుపాదం

- 69 మందికి రూ.1.77 లక్షల జరిమానా
- ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : సీఐ శ్రీనివాస్
- డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ప్రాణనష్టమే ఎక్కువ



**ప్రజానావ, సిరిసిల్ల :** మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై పోలీసులు చర్యలు కొనసాగిస్తున్నట్లు సిరిసిల్ల పట్టణ సీఐ శ్రీనివాస్ తెలిపా రు. పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీ ల్లో 69 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడి నట్లు వెల్లడించారు. పట్టుబడిన వారిని బుధవారం కోర్టులో హాజరు పర చగా, న్యా యమూర్తి మేఘన మొత్తం రూ.1.77 లక్షల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినట్లు సీఐ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రాణనష్టం, రోడ్డు ప్రమా దాలు జరిగే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌కు పాల్పడే వారికి జైలు శిక్షతో పాటు భారీ జరిమానాలు కూడా విధించే అవకాశం ఉందని పేర్కొన్నారు.ప్రజల ప్రాణ భద్రత కోసం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు.

## జగిత్యాల అభివృద్ధిపై ఎమ్మెల్యే సమాధానం చెప్పాలి

- బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ భోగ శ్రావణి

**ప్రజానావ, జగిత్యాల:** జగిత్యాల అభివృద్ధి అంశాలపై ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాలని బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ భోగ శ్రావణి డిమాండ్ చేశారు. బుధవారం జగిత్యాలలోని కమల నిలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. అధికారిక కార్యక్రమాల్లో ప్రతిపక్ష ప్రజాప్రతినిధులను విస్మరించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆమె విమర్శించారు. సభా మర్యాదలను పాటించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులందరిపైనా ఉందన్నారు. జగిత్యాల పట్టణ అభివృద్ధి విషయంలో అధికార పార్టీ వైఫల్యాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. అమృత్ 2.0 పథకం కింద జగిత్యాలకు రూ. 38.60 కోట్లు, రాయికల్‌కు రూ.15 కోట్లు మంజూరైనా ఇప్పటివరకు పనులు ప్రారంభం కాకపోవడం దురదృష్టకరమన్నారు. కేంద్ర విద్యాలయం ఏర్పాటుకు అవసరమైన స్థల కేటాయింపును



అడ్డుకుంటున్నది ఎవరో ప్రజలకు తెలియజేయాలని ఎమ్మెల్యేను ప్రశ్నించారు. ప్రతిపాదిత స్థలంలో జరుగుతున్న ఆక్రమణలపై జిల్లా కలెక్టర్ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. యావర్ రోడ్ విస్తరణకు సంబంధించి గెజిట్ విడుదలై, కొలతలు పూర్తయినప్పటికీ కొత్తగా కొలతల పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రజా సమస్యలను పక్కనబెట్టి రాజకీయ విమర్శలకు పరి మితం కాకుండా అభివృద్ధిపై దృష్టి సారించాలని ఎమ్మెల్యేకు సూచించారు. అవసరమైతే కాంగ్రెస్ పార్టీలో చేరతానన్న వ్యాఖ్యలపై స్పందిస్తూ, ప్రజల మధ్యకు వచ్చి పనిచేయాలని సవాల్ విసిరారు. బీజేపీ ప్రజల పక్షాన నిలబడి ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తుందని భోగ శ్రావణి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు కొక్కు గంగాధర్, వేముల శ్రీనివాస్, ఆముదరాజు, సుంకేట దశరథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం పంపిణీలో అవకతవకలు ఉండొద్దు

- విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ టీం తనిఖీలు
- జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బుచ్చిబాబు హెచ్చరిక

**ప్రజానావ, సిరిసిల్ల :** ధాన్యం కొనుగోలు చేసి రైస్ మిల్లులకు, గోదాములకు ట్రక్ చీట్ ప్రకారం పంపిణీ చేసిన దానిపై ఏవైనా అవకతవకలు జరిగిన పక్షంలో దానిపై సంబంధిత అధికారులు బాధ్యులు అవుతారని, హైదరాబాద్ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ బృందం తనిఖీలు నిర్వహిస్తున్నారని, దీనిపై జాగ్రత్త వహించాలని జిల్లా పౌరసరఫరాల అధికారి బుచ్చిబాబు హెచ్చరించారు. రభీ 2025–26 సీజన్ లో మొత్తం 236 కొనుగోలు కేంద్రముల ద్వారా ఈనెల 16 వరకు 46378 రైతుల వద్ద నుండి 3.65 ఎల్ఎంటి ల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లా లో మొత్తం కొనుగోలు కేంద్రముల నుండి ధాన్యం కొనుగోలు చేసి రైస్ మిల్లు లకు, గోదాము లకు ట్రక్ చీట్ ప్రకారం పంపిణీ జరిగిందా లేక ఏవైనా అవకతవకలు జరిగినట్లయితే సంబందిత కొనుగోలు కేంద్రములకు సంబందించిన మొత్తం మంది ఇంచార్జి, ఏటీఎం, సీఈవో, అలాగే సీసీలు భాధ్యులు అవుతారని హెచ్చరించారు. ఎందుకంటే దీనిపై హైదరాబాద్ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ బృందం తనిఖీలు చేస్తూ పరిశీలన జరుపుతున్నట్టు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బుచ్చిబాబు వెల్లడించారు. అందుకే సంబంధిత సిబ్బంది, బాధ్యులు జాగ్రత్త వహించాలని సమావేశంలో సూచించారు.

# ఉస్మానియా డెంటల్ కాలేజీలో ర్యాగింగ్ కలకలం

- జూనియర్ల వేధింపుల కేసులో 12 మంది విద్యార్థుల సస్పెన్షన్
- సుల్తాన్‌బజార్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు
- హెచ్చరికల తర్వాత కూడా మారని సీనియర్ల తీరు
- ఆల్కహాల్, సిగరెట్లు తెప్పించడం, ఇతర పనులు చేయిస్తూ వేధింపులు




**ప్రజానావ, హైదరాబాద్:** నగరంలోని ఉస్మానియా డెంటల్ కాలేజీలో ర్యాగింగ్ ఘటన వెలుగులోకి రావడంతో కలకలం రేగింది. జూనియర్ విద్యార్థుల ఫిర్యాదు మేరకు సుల్తాన్‌బజార్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మరోవైపు ర్యాగింగ్‌కు పాల్పడిన 12 మంది విద్యార్థులను ఆరు నెలలపాటు సస్పెండ్ చేసినట్లు కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ సర్జీవ్ సింగ్ యాదవ్ వెల్లడించారు. జూన్ 9న ప్రథమ సంవత్సరం బీడీఎస్ విద్యార్థులు తమను సీనియర్లు వేధిస్తున్నారని కాలేజీ యాజమాన్యానికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. వెంటనే స్పం దించిన యాజమాన్యం సంబంధిత థర్డ్ ఇయర్ విద్యార్థులను పిలిపించి హెచ్చరించింది. అయితే, యాజమాన్యం మందలించిన 24 గంటల్లోనే వారు మరోసారి ర్యాగింగ్‌కు పాల్పడినట్లు ఫిర్యాదులు అందాయి. దీంతో నిబంధనలను ఉల్లంఘించి జూనియర్లను వేధించిన 12 మంది విద్యార్థులను ఆరు నెలలపాటు సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు ప్రిన్సిపల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జూనియర్ విద్యార్థులతో ఆల్కహాల్, సిగరెట్లు తెప్పించడం, కూలర్లలో నీళ్లు నింపించడం వంటి పనులు చేయిస్తూ సీనియర్లు వేధింపులకు పాల్పడినట్లు వెల్లడించారు. ర్యాగింగ్ భయంతో కొందరు బాధిత విద్యార్థులు హాస్టల్ గదుల నుంచి బయటకు రావడానికి కూడా భయపడిపోయారని పేర్కొన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడిన థర్డ్ ఇయర్ విద్యార్థులపై గతంలో కూడా పలు ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. గత ఏడాది డిసెంబర్ 31న హాస్టల్‌లోని సీసీ కెమెరాలను ధ్వంసం చేయడంతో పాటు ఇతర విద్యార్థులను ఇబ్బందులకు గురిచేసిన ఘటనలో కూడా వారిపై చర్యలకు సిద్ధమయ్యామని చెప్పారు. అప్పట్లో విద్యార్థులు క్షమాపణలు చెప్పి ఇకపై ఇలాంటి చర్యలకు పాల్పడబోమని హామీ ఇవ్వడంతో అవకాశం ఇచ్చామని, అయినప్పటికీ వారి ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో కఠిన చర్యలు తీసుకోవాల్సి వచ్చిందని వివరించారు. ఈ చర్య విద్యార్థులకు గుణపాఠంగా ఉండటంతో పాటు, తల్లిదండ్రులు కూడా తమ పిల్లల ప్రవర్తనపై బాధ్యత వహించాల్సిన అవసరం ఉందని కాలేజీ యాజమాన్యం అభిప్రాయపడింది. ఇదిలా ఉండగా, బాధిత విద్యార్థుల ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



## నంగునూరులో హరీశ్‌రావు పర్యటన

- అనారోగ్య బాధితులు, మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

**ప్రజానావ, సిద్ధిపేట :** సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు బుధవారం నంగునూరు మండలంలోని పలు గ్రామాల్లో పరామర్శ పర్యటన నిర్వహించారు. అనారోగ్యంతో బాధపడుతున్న నాయకులను, ఇటీవల కుటుంబ సభ్యులను కోల్పోయిన బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలను కలిసి పరామర్శించారు. ఖాతా గ్రామంలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న మాజీ వైస్ ఎంపీపీ దార మహిపాల్ రెడ్డి నివాసానికి వెళ్లిన హరీష్‌రావు, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం అదే గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త సోలిపురం యాదయ్య తండ్రి మల్లయ్య ఇటీవల మృతిచెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శిం చి సంతాపం తెలిపారు. అలాగే పాలమాకుల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త నరేష్ గౌడ్ తండ్రి తాళ్లపల్లి పర్శరాములు మృతి పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కోనాయిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ నిమ్మ రాజిరెడ్డి ఇటీవల మరణించగా, ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాజిరెడ్డి సేవలను స్మరించు కుంటూ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ పరామర్శ పర్యటనలో నంగునూరు మండల బీఆర్ఎస్ నాయకులు జాప శ్రీకాంత్‌రెడ్డి, కోల రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
విలేకరులు కావలెను
రెండు తెలుగు రాష్ట్రాల్లో వేగంగా విస్తరిస్తున్న తెలుగు దినపత్రిక ప్రజానావలో పని చేయుటకు మా సంస్థ ఆహ్వానం పలుకుతోంది
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాల్లో పనిచేయుటకు విలేకరులు కావలెను.
మండలాలు, అర్బన్, పట్టణ కేంద్రాల్లో పనిచేసే వారికి కనీస అర్హత ఇంటర్మీడియట్
స్టాఫ్ రిపోర్టర్, ఆర్‌సీ ఇన్‌చార్జీలకు కనీస అర్హత డిగ్రీ ఉండాలి
మీ బయోడేటాను ఇప్పుడే ఈ నెంబర్లకు వాట్సాప్ చేయండి
9948433277, 9014966169




EDITORIAL

# విద్యార్థులకు 'నీట్' కటకట

దేశవ్యాప్తంగా వైద్య విద్యలో ప్రవేశాలకు నిర్వహిస్తున్న 'నీట్' పరీక్ష మరోసారి వివాదాల కేంద్రంగా మారింది. పేపర్ లీక్ ఘటనల నేపథ్యంలో జూన్ 21న పునఃపరీక్ష నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రశ్నపత్రాల తయారీలో పాల్గొన్న నిపుణులను రహస్య ప్రదేశాల్లో ఉంచి, వారికి ఫోన్లు, టెలివిజన్లు వంటి కమ్యూనికేషన్ సౌకర్యాలు లేకుండా ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచినట్లు సమాచారం. గతంలో రాష్ట్రాల వారీగా నిర్వహించిన ఎంసెట్ పరీక్షలు పెద్దగా వివాదాలకు తావివ్వకుండా సాఫీగా జరిగేవని, జాతీయ స్థాయిలో నీట్ ప్రవేశపెట్టిన తర్వాత పేపర్ లీక్‌లు, అవకతవకలు, గందరగోళం తరచూ చోటుచేసుకుంటున్నా యని విద్యావేత్తలు, విద్యార్థి సంఘాలు విమర్శిస్తున్నాయి.

దేశవ్యాప్తంగా వైద్య విద్యలో ప్రవేశాలకు నిర్వహిస్తున్న 'నీట్' పరీక్ష మరోసారి వివాదాల కేంద్రంగా మారింది. పేపర్ లీక్ ఘటనల నేపథ్యంలో జూన్ 21న పునఃపరీక్ష నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రశ్నపత్రాల తయారీలో పాల్గొన్న నిపుణులను రహస్య ప్రదేశాల్లో ఉంచి, వారికి ఫోన్లు, టెలివిజన్లు వంటి కమ్యూనికేషన్ సౌకర్యాలు లేకుండా ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచినట్లు సమాచారం. గతంలో రాష్ట్రాల వారీగా నిర్వహించిన ఎంసెట్ పరీక్షలు పెద్దగా వివాదాలకు తావివ్వకుండా సాఫీగా జరిగేవని, జాతీయ స్థాయిలో నీట్ ప్రవేశపెట్టిన తర్వాత పేపర్ లీక్‌లు, అవకతవకలు, గందరగోళం తరచూ చోటుచేసుకుంటున్నా యని విద్యావేత్తలు, విద్యార్థి సంఘాలు విమర్శిస్తున్నాయి. పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈసారి అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. సీఆర్‌పీఎఫ్ బలగాల పర్యవేక్షణతో పాటు ప్రత్యేక భద్రతా చర్యలు అమలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఇప్పటికే పరీక్ష రాసిన విద్యార్థులు మళ్లీ సన్నద్ధం కావాల్సి రావడంతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ఇప్పటికే నీట్ పరీక్షల నిర్వహణలో లోపాలపై సుప్రీం కోర్టు గతంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) పనితీరును ప్రశ్నించింది. యూపీఎస్సీ వంటి పరీక్షలను సమర్థంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో నీట్ నిర్వహణలో తరచూ సమస్యలు తలెత్తడంపై ఆందోళన వ్యక్తమైంది. పునఃపరీక్షకు సంబంధించిన అడ్మిట్‌కార్డులు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు ఎన్‌టీఏ ప్రకటించగానే భారీ సంఖ్యలో విద్యార్థులు పోర్టల్‌ను సందర్శించారు. దీంతో సర్వర్లపై ఒత్తిడి పెరిగి, వెబ్‌సైట్ నెమ్మదిగా పనిచేయడం, మధ్యలో నిలిచిపోవడం, 'టైమ్‌ఔట్' సందేశాలు కనిపించడం వంటి సమస్యలు తలెత్తాయి. ఇప్పటికే పేపర్ లీక్ వివాదాలతో ఆందోళనలో ఉన్న విద్యార్థులు ఈ సాంకేతిక సమస్యలపై అసహనం వ్యక్తం చేశారు. ఫీజు రిఫండ్ ప్రక్రియలో కూడా సమస్యలు ఎదురవుతున్నాయని పలువురు విద్యార్థులు పేర్కొన్నారు. బ్యాంకు ఖాతా వివరాలు సమర్పించినప్పటికీ, వివరాలు అందలేదంటూ సందేశాలు కనిపిస్తున్నాయని, కొందరు పొరపాటున 'రిఫండ్ అవసరం లేదు' అనే ఎంపికను ఎంచుకున్నామని, దానిని సవరించుకునే అవకాశం కల్పించాలని ఎన్‌టీఏను కోరారు. ఈ ఫిర్యాదులపై స్పందించిన ఎన్‌టీఏ, విద్యార్థుల భారీ సంఖ్యలో వెబ్‌సైట్‌ను సందర్శించడం వల్ల సాంకేతిక సమస్యలు ఏర్పడ్డాయని, వాటి పరిష్కారానికి నిపుణులు పనిచేస్తున్నారని తెలిపింది. ఇప్పటివరకు సుమారు నాలుగు లక్షల మంది విద్యార్థులు తమ అడ్మిట్‌కార్డులను డౌన్‌లోడ్ చేసుకున్నట్లు వెల్లడించింది. పరీక్ష రద్దు, పునఃపరీక్ష నేపథ్యంలో ఫీజు రిఫండ్ ప్రకటించడాన్ని ఆసరాగా చేసుకుని సైబర్ నేరస్థులు కూడా రంగంలోకి దిగారు. బిహార్‌లోని గయ జిల్లాకు చెందిన 19 ఏళ్ల నవీన్ యాదవ్ 150 మంది విద్యార్థుల ఖాతాల్లో జోక్యం చేసుకుని, వారి రిఫండ్ మొత్తాలను తన ఖాతాకు మళ్లించినట్లు పోలీసులు గుర్తించారు. ఒక్కో విద్యార్థికి రావాల్సిన రూ.1,700 చొప్పున మొత్తాలను అక్రమంగా తన ఖాతాలోకి మళ్లించినట్లు దర్యాప్తులో తేలింది. గుజరాత్‌లోని అహ్మదాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. ఇక పునఃపరీక్ష ప్రశ్నపత్రాలు అందిస్తామంటూ విద్యార్థులు, తల్లిదండ్రులను మోసం చేస్తున్న రాజస్థాన్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. టెలిగ్రామ్ ఛానళ్ల ద్వారా ప్రచారం నిర్వహించి, కోట్ల రూపాయల లావాదేవీలు జరిపినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఒకే పరీక్ష నిర్వహణ కోసం ఇంత భారీ భద్రతా ఏర్పాట్లు, ప్రధాని కార్యాలయం ప్రత్యక్ష పర్యవేక్షణ అవసరమా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. తమిళనాడు బీజేపీ మాజీ అధ్యక్షుడు, మాజీ పోలీసు అధికారి అన్నామలై కూడా ఈ అంశంపై స్పందిస్తూ, ఇటువంటి పరిస్థితులు పరీక్షల నిర్వహణలో ఉన్న లోపాలను స్పష్టం చేస్తున్నాయని పేర్కొన్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పని తీరుపై సమగ్ర సమీక్ష నిర్వహించి, యూపీఎస్సీ తరహాలో వ్యవస్థను పటిష్టం చేయాలని, లేకపోతే నీట్ విధానాన్ని పునఃపరిశీలించాల్సిన అవసరం ఉందని విద్యావేత్తలు, విద్యార్థి సంఘాలు అభిప్రాయపడుతున్నాయి.

పునఃపరీక్ష ప్రశ్నపత్రాలు అందిస్తామంటూ విద్యార్థులు, తల్లిదండ్రులను మోసం చేస్తున్న రాజస్థాన్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. టెలిగ్రామ్ ఛానళ్ల ద్వారా ప్రచారం నిర్వహించి, కోట్ల రూపాయల లావాదేవీలు జరిపినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఒకే పరీక్ష నిర్వహణ కోసం ఇంత భారీ భద్రతా ఏర్పాట్లు, ప్రధాని కార్యాలయం ప్రత్యక్ష పర్యవేక్షణ అవసరమా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పని తీరుపై సమగ్ర సమీక్ష నిర్వహించి, యూపీఎస్సీ తరహాలో వ్యవస్థను పటిష్టం చేయాలని, లేకపోతే నీట్ విధానాన్ని పునఃపరిశీలించాల్సిన అవసరం ఉందని విద్యావేత్తలు, విద్యార్థి సంఘాలు అభిప్రాయపడుతున్నాయి.

# ముగింపు దశకు ధాన్యం కొనుగోళ్లు

- మెదక్ జిల్లాలో 4.10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
- రైతుల ఖాతాల్లో రూ.846 కోట్లు జమ



ప్రజానావ, మెదక్ : మెదక్ జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోళ్లు ముగింపు దశకు చేరుకున్నా యని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపా రు. జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి భారీ స్థాయిలో ధాన్యం సేకరించినట్లు వెల్లడించారు. జిల్లాలో 93,950 మంది రైతుల నుంచి మొత్తం 4,10,166.480 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన చెల్లింపులలో భాగంగా ఇప్పటివరకు 81,301 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.846 కోట్లను జమ చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 507 ధాన్యం కొనుగోలు కేంద్రాలు బుధవారం నాటికి మూసి వేసినట్లు వెల్లడించారు. ఇంకా ధాన్యం విక్రయించాల్సిన రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవస రం లేదని, ప్రభుత్వం చివరి గింజ వరకు ధాన్యాన్ని కొనుగోలు చేయ డానికి కట్టుబడి ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు. రైతులు ధైర్యంగా ఉండా లని, ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తిస్థాయిలో విజయవంతం చేసేందుకు జిల్లా యంత్రాంగం అవసరమైన చర్యలు కొనసాగిస్తోందని కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు.

# యూరియా బుకింగ్ యాప్ ప్రారంభం

- ఇంటి వద్ద నుంచే యూరియా బుకింగ్ సౌకర్యం
- రైతులకు ఎరువుల కొరత రాకుండా చర్యలు
- కలెక్టర్ అంకిత్, ఎమ్మెల్యే కోరం కనకయ్య



ప్రజానావ, టేకులపల్లి : రైతులు ఇంటి వద్ద నుంచే సులభంగా యూరియా బుక్ చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్‌ను జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం టేకులపల్లి మండలంలోని బేతంపూడి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, జిల్లాలో వ్యవసాయ అవసరాల కోసం సుమారు 40 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమవుతుందని, ప్రస్తుతం 15 వేల మెట్రిక్ టన్నుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులకు అవసరమైన మేరకు యూరియా సరఫరా చేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందన్నారు. అవసరానికి మించి యూరియా వినియోగించడం వల్ల భూసార నాణ్యత దెబ్బతింటుందని, రైతులు వ్యవసాయ శాఖ సూచించే శాస్త్రీయ పద్ధతులను పాటిస్తూ సమతుల్య ఎరువుల వినియోగంపై దృష్టి పెట్టాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమో దయ్యే అవకాశం ఉన్నందున పంటల వైవిధ్యీక రణ, పంట మార్పిడి విధానాలను అనుసరిం చాలని రైతులకు సూచించారు. ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్‌పై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించిన కలెక్టర్, టేకులపల్లి మండలంలో ఐదు రైతు వేదికల ద్వారా యూరియా పంపిణీ జరుగుతోందని తెలిపారు. రైతులు 1800–123–7157 టోల్‌ఫ్రీ నంబర్ సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ, ప్రతి రైతుకు తగినంత ఎరువులు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రైతులకు ఎరువుల కొరత తలెత్తకుండా ప్రభుత్వం నిరంతరం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. గత సీజన్‌లో మొక్కజొన్నను మద్దతు ధరకు కొనుగోలు చేసి రైతులకు అండగా నిలిచిన విషయాన్ని గుర్తుచేశారు. ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా రైతులు ఇంటి నుంచే యూరియా బుక్ చేసుకునే అవకాశం కల్పించడం రైతు సంక్షేమానికి ప్రభుత్వం తీసుకొచ్చిన మరో ముందడుగని పేర్కొన్నారు. అనంతరం యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకున్న రైతులకు కలెక్టర్ అంకిత్, ఎమ్మెల్యే కోరం కనకయ్య యూరియా బస్తాలను అందజేశారు. అనంతరం టేకులపల్లి ఏ కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల పనులను పరిశీలించిన వారు, నిర్మాణాలను నాణ్యతతో వేగంగా పూర్తి చేసి లబ్ధిదారులు త్వరగా గృహ ప్రవేశం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

# భారీగా గంజాయి పట్టివేత

- రూ.4.29 లక్షల విలువైన 8.58 కిలోల ఎండు గంజాయి పట్టివేత
- ఒకరు అరెస్ట్, పరారీలో మరో ఇద్దరు




ప్రజానావ, భద్రాచలం : భద్రాచలం పట్టణ పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో భారీ మొత్తంలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. భద్రాచలం డీఎస్పీ ఆదేశాల మేరకు పట్టణ ఎస్ఐ పి. శ్యాంప్రసాద్ సిబ్బందితో కలిసి కూనవరం రోడ్డులోని శ్రీ సుప్రియ (హెచ్‌పీ) పెట్రోల్ బంక్ సమీపంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానాస్పదంగా వచ్చిన పల్సర్ మోటార్‌సైకిల్‌ను ఆపేందుకు ప్రయత్నించగా, వాహనం వెనుక కూర్చున్న వ్యక్తి లగేజ్ బ్యాగ్‌తో దిగిపోయాడు. అదే సమయంలో బైక్ నడుపుతున్న వ్యక్తి అక్కడి నుంచి పరారయ్యాడు. పోలీసులు పట్టుబడిన వ్యక్తి వద్ద ఉన్న బ్యాగ్‌ను తనిఖీ చేయగా, నాలుగు ప్యాకెట్లలో మొత్తం 8.580 కిలోల ఎండు గంజాయి లభించింది. అరెస్టు చేసిన నిందితుడిని భద్రాచలం సుందరయ్యనగర్ కాలనీకి చెందిన పర్సిక నాగేశ్వరరావు (45)గా గుర్తించారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ. 4.29 లక్షలు ఉంటుందని పోలీసులు తెలి పారు. ఒడిశా సరిహద్దు ప్రాంతం నుంచి గంజాయిని తీసుకొచ్చి విక్రయించేందుకు ప్రయత్ని స్తున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఈ కేసులో ప్రధాన నిందితుడు, కొనుగోలుదారు పరారీలో ఉండగా, వారి కోసం ప్రత్యేక బృందా లు గాలింపు చర్యలు చేపట్టాయి. పంచుల సమక్షంలో గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. భద్రాచలం పట్టణ ఎస్ఐ వి. సతీష్ కేసు నమోదు చేయగా, దుమ్ముగూడెం ఇన్‌స్పెక్టర్, భద్రాచలం ఇన్‌చార్జి వెంకటప్పయ్య నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడు తూ, భద్రాచలం ప్రాంతాన్ని గంజాయి రహిత ప్రాంతంగా మార్చేందుకు ప్ర త్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని తెలిపా రు. గంజాయి విక్రయదారులు, రవాణా దారులు, మధ్యవర్తులు, వినియోగదారులపై నిరంతర నిఘా కొనసాగుతోందని పేర్కొన్నారు. మాదక ద్రవ్యాల వ్యాపారానికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తూ, గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల విక్రయం, రవాణా, నిల్వలపై సమాచారం ఉన్నవారు వెంటనే పోలీసులకు తెలియజేయాలని, సమాచారదా తల వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

# అప్రెంటిస్‌షిప్ శిక్షణతో యువతకు ఉపాధి

- కలెక్టర్ దివాకర టీఎస్

ప్రజానావ, ఖమ్మం : నేషనల్ అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్ స్కీమ్ ద్వారా యువత నైపుణ్యాలను పెంపొందించుకుని మెరుగైన ఉపాధి అవకాశాలు పొందవచ్చని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులు, వివిధ సంస్థల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, డిప్లొమా, ఆర్ట్స్, సైన్స్, కామర్స్ విద్యార్థులు ఈ పథకంలో భాగస్వాములు కావాలని కలెక్టర్ సూచించారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు ప్రాక్టికల్ నైపుణ్యాలు అందించడంలో ఈ పథకం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. అప్రెంటిస్‌షిప్ ద్వారా పరిశ్రమలు తమకు అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులను ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుందని, శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు అందించే స్టైఫండ్‌లో ప్రభుత్వ వాటా నేరుగా డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా వారి ఖాతాల్లో జమ అవుతుందని వివరించారు. అప్రెంటిస్‌షిప్ పూర్తయ్యే సమయానికి పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ పొందిన సిబ్బంది అందుబాటులోకి వస్తారని తెలిపారు. నేషనల్ అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్ స్కీమ్ పోర్టల్ ద్వారా ఖాళీల ప్రకటన, దరఖాస్తుల పరిశీలన, ఒప్పందాల సృష్టి వంటి ప్రక్రియలన్నీ పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వ హించవచ్చన్నారు. తెలంగాణలోని ప్రభుత్వ, ప్రైవేట్, ఎంఎస్‌ఎంఈ సంస్థలు అధికారిక ఎన్‌ఏటీఎస్ పోర్టల్‌లో నమోదు చేసుకుని అప్రెంటి స్‌లను నియమించుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ప్రవీణ్ కుమార్, లీడ్ బ్యాంక్ మేనేజర్ రవి ప్రసాద్, ఆర్టీవో శ్రీనివాసరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ముజాహిద్, గిరిజన సంక్షేమ శాఖ డీడీ విజయలక్ష్మి, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాస చారి, జిల్లా ఉపాధికల్పన అధికారిణి మాధవి, పరిశ్రమల శాఖ ఏడీ నకుల్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

# మోత్కూరులో కోర్టు ఏర్పాటు చేయాలి

## హైకోర్టు రిజిస్ట్రార్‌కు ఎమ్మెల్యే మందుల సామేల్ వినతి



ప్రజానావ, మోత్కూరు : మోత్కూరులో కోర్టు ఏర్పాటు చేయాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ హైకోర్టు రిజిస్ట్రార్‌ను కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మోత్కూరు, ఆత్మకూరు(ఎం), అడ్డగూడూరు, గుండాల మండలాల ప్రజలు న్యాయ సంబంధిత పనుల కోసం ప్రస్తు తం రామన్నపేట, భువనగిరి, ఆలేరు కోర్టులకు వెళ్లాల్సి వస్తోందని తెలి పారు. మోత్కూరులో కోర్టు ఏర్పాటు చేస్తే ఈ ప్రాంత ప్రజలకు న్యాయ సేవలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ఈ నాలుగు మండలాలకు సంబంధించిన సుమారు 1,600 కేసులు ప్రస్తుతం వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయని, సాధారణంగా 600 కేసులు ఉంటేనే కొత్త కోర్టు ఏర్పాటు చేసే అవకాశం ఉంటుందని వివరిం చారు. మోత్కూరులో కోర్టు ఏర్పాటైతే ప్రజలకు సమయం, వ్యయభారం తగ్గడంతో పాటు ప్రాంతీ య అభివృద్ధికి కూడా దోహదపడుతుందని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై హైకోర్టు రిజిస్ట్రార్‌కు వివరిం చగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. త్వరలోనే మోత్కూరులో కోర్టు ఏర్పాటు ప్రక్రియకు ఆమోదం లభిస్తుందనే ఆశాభావాన్ని ఎమ్మెల్యే మందుల సామేల్ వ్యక్తం చేశారు.

# ఓటర్ల జాబితా ప్రక్షాళనకు పార్టీలు సహకరించాలి

- కొత్త ఓటర్లు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి
- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



ప్రజానావ, సూర్యాపేట : ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ కోరారు. క్షేత్రస్థాయిలో బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ ఓటర్ల జాబితా ప్రక్షాళన చేపట్టాలని సూచించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహించేందుకు అధికారులు, రాజకీయ నాయకులు కలిసి పనిచేయాలని కోరారు. జూన్ 18న బీఎల్ఓలు, అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి అధికారులకు క్షేత్రస్థాయి శిక్షణ అందజేస్తామని తెలిపారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు ఇంటింటి సర్వే నిర్వహించి ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేసి ఓటర్ల వివరాలను సేకరిస్తారని చెప్పారు. 2002 ఓటరు జాబితాను ఆధారంగా తీసుకుని కుటుంబ సభ్యుల వివరాల ధృవీకరణ చేపడతామని వెల్లడించారు. జూలై 24 నుంచి 30 వరకు ప్రతి పోలింగ్ కేంద్రంలో గరిష్ఠంగా 1,200 మంది ఓటర్లు ఉండేలా హేతుబద్ధీకరణ ప్రక్రియ చేపడతామని తెలిపారు. జూలై 31న ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేసి, అభ్యంతరాల పరిశీలన అనంతరం అక్టోబర్ 1న తుది ఓటరు జాబితాను ప్రకటిస్తామని చెప్పారు. తప్పుడు సమాచారం ఇచ్చిన వారి పేర్లను వెంటనే తొలగించకుండా నోటీసులు జారీ చేసి విచారణ అనంతరం నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. వలస వెళ్లినవారు, మరణించిన వారు, డూప్లికేట్ ఓటర్లను గుర్తించి జాబితా నుంచి తొలగిస్తామని తెలిపారు. ప్రజాప్రాతినిధ్య చట్టం–1950లోని సెక్షన్ 31 ప్రకారం, ఓటరు నమోదుకు సంబంధించి ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం అందిస్తే జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రస్తుత జాబితాలో పేరు లేని వారు ఫామ్–6 ద్వారా కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. అక్టోబర్ 1, 2026 నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకునే యువత ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి మారిన వారు ఫామ్–8 ద్వారా వివరాలు సవరించుకోవచ్చని వెల్లడించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, జిల్లా రెవెన్యూ అధికారి డి. ప్రేమ్‌రాజ్‌తో పాటు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, సీపీఐ(ఎం), బీఎస్పీ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఉరుములు, మెరుపులతో ఖమ్మం వణుకు

- గంటపాటు కురిసిన భారీ వర్షానికి జలమయమైన నగరం
- రోడ్లపై వరద నీరు.. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు



ప్రజానావ, ఖమ్మం : ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం బుధవారం రాత్రి ఖమ్మం నగరాన్ని వణికించింది. ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై కటిక చీకట్లు అలుముకోగా, భారీ ఉరుములు, మెరుపులతో నగర ప్రజలు భయాందోళనకు గురయ్యారు. దాదాపు గంటపాటు ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో నగరంలో జనజీవనం అస్తవ్యస్తమైంది. కొన్ని రోజులుగా తీవ్ర ఎండలతో ఉక్కిరిబిక్కిరైన ప్రజలకు ఈ వర్షం ఉపశమనం కలిగించినప్పటికీ, భారీ ఉరుములు, గాలుల కారణంగా ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. వర్షం ధాటికి నగరంలోని డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతిని మురుగు కాల్వలు పొంగిపొర్లాయి. వరద నీరు రోడ్లపైకి చేరడంతో వైరా రోడ్, పాత బస్టాండ్, మయూరి సెంటర్, కస్బా బజార్, కమాన్ బజార్, గాంధీ చౌక్, కాల్వ ఒడ్డు, జూబ్లీ క్లబ్ తదితర ప్రధాన ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు చోట్ల మోకాళ్ల లోతు వరకు నీరు చేరడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. లోతట్టు ప్రాంతాల్లోని కొన్ని ఇళ్లలోకి కూడా వరద నీరు చేరడంతో స్థానికులు ఆందోళన చెందారు. వర్షాకాలం ప్రారంభంలోనే కేవలం గంటపాటు కురిసిన వర్షానికే నగరం ముంపునకు గురికావడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీ కాల్వల పూడికతీత పనులు సక్రమంగా చేపట్టకపోవడమే ఈ పరిస్థితికి కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో మున్సిపల్ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టి, డ్రైనేజీ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని నగర ప్రజలు కోరుతున్నారు.

# విద్యా ప్రోత్సాహానికి ముందడుగు

## విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

ప్రజానావ, నారాయణ్‌పేట్ : నర్వ మండలంలోని కల్వాల్ ఎంపీపీఎస్ పాఠశాలలో కొత్త విద్యా సంవత్సరం ప్రారంభాన్ని పురస్కరించుకుని బుధవారం సామూహిక అక్షరాభ్యాసం, నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో కొత్తగా చేరిన చిన్నారులకు సంప్రదాయబద్ధంగా అక్షరాభ్యాసం చేయించి విద్యా ప్రయాణానికి శ్రీకారం చుట్టారు. అనంతరం విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు, వర్క్‌బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన గ్రామ సర్పంచ్ కె. చెన్నప్ప, వార్డు సభ్యుడు రవి వర్మ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాగరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

### జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమంగా..

మక్తల్ మండలంలోని ఖానాపూర్ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థి చాకలి రాకేష్ తన జన్మదినాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ టి. జయశ్రీ శివరాజ్, ఏఏపీసీ చైర్మన్ కవిత, ఉపాధ్యాయులు మారుతి, స్వాతి, వార్డు సభ్యులు, గ్రామ ప్రముఖులు పాల్గొని విద్యార్థులకు విద్యా సామగ్రిని అందజేశారు.



## భీమేశ్వర స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే గంగుల

**ప్రజానావ, వేములవాడ :** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన భీమేశ్వర స్వామివారిని కరీంనగర్ శాసనసభ్యులు గంగుల కమలాకర్ కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మె ల్యే గంగుల కమలాకర్ గారికి ఆలయ అర్చకులు వేద మంత్రోచ్ఛారణలతో, స్వస్తి వచనాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు. తదుపరి స్వామివారి మండపంలో ఆలయ అర్చకులు, వేద పండితులు ఎమ్మెల్యేకి తీర్థప్ర సాదాలు అందజేసి ఆశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా ఆలయ డీఈవో భాస్కర శర్మ గారు స్వామివారి శేషవస్త్రం, లడ్డూ ప్రసాదాన్ని అందజేసి సత్కరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని బద్ది పోచమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక మొక్కులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ జి. శ్రావణ్ కుమార్, ప్రోటోకాల్ అండ్ టెంపుల్ పర్యవేక్షకులు జి. శ్రీనివాస్ శర్మ, నూగురి నరేందర్, టెంపుల్ ఇన్స్పెక్టర్ గౌతమ్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అవినీతి ఆరోపణలు నిరాధారం

- ఆధారాలు ఉంటే ఎలాంటి విచారణకైనా సిద్ధం
- వాస్తవాలు లేకుండా ఆరోపణలు మంచిది కాదు
- మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజానావ, కరీంనగర్ :** మాజీ మంత్రి హరీష్ రావు చేసిన రూ.2 వేల కోట్ల అవినీతి ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడిన ఆయన, ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం ప్రజల్లో రాజకీయ నాయకుల పట్ల ఉన్న గౌరవాన్ని దెబ్బతీస్తుందని అన్నారు. జిల్లాలో గతంలో సీనియర్ నాయకులు వెంకటస్వామి, చొక్కారావు అనుసరించిన విలువల రాజకీయాలనే తాము కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. తాను, మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రజా జీవితంలో పారదర్శకతకు కట్టుబడి పనిచేస్తున్నామని చెప్పారు. విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో ఉన్న తమ ఎదుగుదల ప్రజల ముందే జరిగిందని, తమ రాజకీయ ప్రస్థానం పూర్తిగా పారదర్శకమైందని తెలిపారు. సంక్షేమ శాఖలకు సంబంధించిన సెంట్రల్ ప్రొక్యూర్‌మెంట్ టెండర్ల మొత్తం విలువే రూ.2 వేల కోట్లకు చేరుకోనప్పుడు, అదే మొత్తంలో అవినీతి జరిగిందని ఆరోపించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వాస్తవాధారాలు లేకుండా ఆరోపణలు చేయడం బాధ్యతాయుత రాజకీయాలకు విరుద్ధమని వ్యాఖ్యానించారు. బలహీన వర్గాలు, దళితులు, మైనారిటీలకు ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రులపై అవహేళనాత్మక వ్యాఖ్యలు చేయడం బాధాకరమని పొన్నం ప్రభాకర్ అన్నారు. అలాంటి వ్యాఖ్యలు ఆయా సామాజిక వర్గాల పట్ల ఉన్న వైఖరిని ప్రతిబింబిస్తాయని పేర్కొన్నారు. ప్రభుత్వం పూర్తిగా పారదర్శకంగా పనిచేస్తోందని, చేసిన ఆరోపణలను నిరూపిస్తే ఎలాంటి విచారణకైనా సిద్ధంగా ఉన్నామని ఆయన సవాల్ విసిరారు. అయితే ఆధారాలు లేకుండా అసత్య ఆరోపణలు చేయడాన్ని తెలంగాణ సమాజం సహించబోదని హెచ్చరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) అంశంపై స్పందించిన మంత్రి, భారత ప్రజాస్వామ్యంలో ఏ ఒక్క అర్హ ఓటరుకూ అన్యాయం జరగకుండా వ్యవస్థలు పనిచేయాలని అన్నారు. ఎస్ఐఆర్ అమలు విషయంలో ప్రతిపక్షాలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో, ఈ అంశంపై బీజేపీ తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

## జీవన్ జ్యోతి బీమా పథకాన్ని వినియోగించుకోండి

- కలెక్టర్ హరిత

**ప్రజానావ, ఆసిఫాబాద్:** జిల్లాలో 18 నుంచి 65 సంవత్సరాల మధ్య వయస్సు గల అర్హులందరూ ప్రధానమంత్రి జీవన్ జ్యోతి భీమా యోజనలో చేరి బీమా రక్షణ పొందాలని జిల్లా కలెక్టర్ కె. హరిత సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో బీమాదారుల కుటుంబ సభ్యులకు బీమా చెక్కులను అందజేశారు. ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ ద్వారా ప్రధానమంత్రి జీవన్ జ్యోతి భీమా యోజనలో సభ్యత్వం పొందిన బెజ్జూర్ మండలం మొగవెల్లి గ్రామానికి చెందిన సీహెచ్. లక్ష్మి మృతి చెందగా, ఆమె నామినీ పెంటు బాయికి రూ.2 లక్షల బీమా చెక్కును కలెక్టర్ అందజేశారు. అదేవిధంగా, అదే గ్రామానికి చెందిన కనక కమల రాయల్ సుందరం బీమా పథకంలో రూ.565 ప్రీమియంతో సభ్యత్వం పొందగా, ఆమె పాము కాటుతో మృతి చెందిన నేపథ్యంలో ఆమె కుమారుడు కనక సుధాకర్‌కు రూ.10 లక్షల బీమా చెక్కును అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తపాలా శాఖ ద్వారా ఏడాదికి కేవలం రూ.565 ప్రీమియంతో బీమా సౌకర్యం పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో తపాలా శాఖ సీనియర్ మేనేజర్ కొట్టే శ్రీనివాస్, మేనేజర్ సాగర్, రాయల్ సుందరం ప్రాంతీయ మేనేజర్ ధన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# పానీపూరీ తిని పలువురికి అస్వస్థత

- ఘటనపై కేటీఆర్ ఆరా
- బాధితులకు అండగా ఉండాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యకు ఆదేశాలు



**ప్రజానావ, సిరిసిల్ల :** తంగళ్ళపల్లి మండలం మండేపల్లి శివారులోని కేసీఆర్ నగర్‌లో పానీపూరి తిని పలువురు అస్వస్థతకు గురైన ఘటనపై స్థానిక ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెంటనే స్పందించారు. ఈ ఘటనపై ఆయన తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, అధికారులకు అలాగే స్థానిక నాయకులకు ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మంగళవారం రాత్రి కేసీఆర్ నగర్‌లో తోపుడు బండిపై విక్రయిస్తున్న పానీపూరి తిని 12 మంది చిన్నారులు, 7 గురు పెద్దవాళ్లు అస్వస్థతకు గురయ్యారు. వీరిలో 12 మంది చిన్నారులు అదే రోజు రాత్రే సిరిసిల్ల ఆసుపత్రిలో చేరగా, బుధవారం ఉదయం మరో 7 గురు పెద్దవారు ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యారు. మొత్తం 19 మంది ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అయితే వీరిలో ఎవరికీ ఎలాంటి ప్రాణాపాయం లేదని, అందరూ వేగంగా కోలుకుంటున్నారని వైద్యులు కేటీఆర్‌కు వివరించారు. బాధితులంతా క్షేమంగా ఉన్నారన్న విషయం తనకు ఎంతో రిలీఫ్ ఇచ్చిందని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ ఘటనలో అనారోగ్యం పాలైన వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, తోట ఆగయ్యకు సూచించారు. వారికి మెరుగైన వైద్యం అందేలా చూస్తూ పార్టీ తరఫున అండగా నిలవాలని సూచించారు. కేటీఆర్ సూచన మేరకు బీఆర్ఎస్ నాయకులు కొండూరు రవీందర్ రావు, చీటి నర్సింగరావు, జిందం చక్రపాణి వెంటనే ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. కేటీఆర్ ఆదేశాల మేరకు పార్టీ నాయకులు సిరిసిల్ల ఆసుపత్రికి బయలుదేరి వెళ్లారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, వారికి ధైర్యం చెప్పారు. ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి వారికి మెరుగైన చికిత్స అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం వాతావరణంలో వస్తున్న మార్పులు, సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా కేటీఆర్ సూచించారు. ముఖ్యంగా కలుషిత నీరు, బయట దొరికే చిరుతిండ్ల (స్ట్రీట్ ఫుడ్) విషయంలో పిల్లలు, పెద్దలు మరింత జాగ్రత్త వహించాలని ఆయన కోరారు.

## డాన్స్ పోటీల్లో మహాన్యదే ప్రథమ స్థానం

- అభినందించిన జిల్లా ఎస్పీ మహేష్ బీ. గితే
- ఇతర రాష్ట్రాల నుంచి పాల్గొన్న 800 మంది నృత్యకారులు

**ప్రజానావ, సిరిసిల్ల :** రాష్ట్ర స్థాయి నువ్వా – నేనా డ్యాన్స్ పోటీలలో రాజన్న సిరిసిల్ల జిల్లా నృత్యకారిణి వంగల మహన్య కూచిపూడి, ఫోక్ డాన్స్ రెండింటిలో జూనియర్ విభాగంలో ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. ఈనెల 13న సికింద్రాబాద్ హరిహర కళాభవన్‌లో ఈ పోటీలు జరిగాయి. ఇందులో తెలంగాణ రాష్ట్రమే గాక ఇతర రాష్ట్రాల నృత్యకారులు దాదాపుగా 800 మంది పాల్గొన్నారని, ఈ పోటీలకు సినిమా కొరియోగ్రాఫర్ అలాగే తెలంగాణ స్పోర్ట్స్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, స్వరూపలు జడ్జిలుగా పాల్గొన్నారు. ఈ పోటీలలో చిన్నారి అద్భుత నృత్య ప్రదర్శన చేసిందనినాట్య గురువు లిటిల్ డాన్స్ కల్చరల్ అకాడమీ ధర్మేందర్ తెలిపారు. జిల్లా కీర్తిని చాటిన మహన్యను జిల్లా మహేష్ బి. గితే, బాబాసాహెబ్ లు అభినందించారు.



## కేసీఆర్ నగర్‌లో ప్రత్యేక వైద్య శిబిరం

- పానీపూరి తిని అస్వస్థత గురైన సంఘటన నేపథ్యంలో స్పందించిన అధికారులు
- వైద్య సేవలు, గ్రామస్తులను అప్రమత్తం చేసిన యంత్రాంగం

**ప్రజానావ, సిరిసిల్ల :** తంగళ్ళపల్లి మండలం కేసీఆర్ నగర్‌లో పానీ పూరీ తిని కొంతమంది చిన్నారులు అస్వస్థతకు గురైన నేపథ్యంలో బుధవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఆశా కార్యకర్తలు మరియు వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి, అవసరమైన వారికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌వో డా. ఏంజెల్ అల్ఫ్రెడ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డా. నాగేంద్ర బాబు, వైద్యాధికారి డా. స్నేహ ప్రాంతాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. అధికారులు పరిశుభ్రత, తాగునీటి వనరులను పరిశీలించి, ప్రజలకు తప్పనిసరిగా స్వచ్ఛమైన తాగునీటిని ఉపయోగించాలని, ఓఆర్ఎస్ ద్రావణాన్ని తయారు చేసిన 24 గంటల లోపే వినియోగించాలని అవగాహన కల్పించారు. అలాగే వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా వ్యాధులను నివారించవచ్చని సూచించారు. స్థానిక వార్డు సభ్యురాలు రోజాతో పరిసరాల పరిశుభ్రత, డ్రైనేజీ నిర్వహణ మరియు పారిశుద్ధ్య చర్యలపై చర్చించారు. ప్రజారోగ్య పరిరక్షణకు అవసరమైన పారిశుద్ధ్య చర్యలను మరింత పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈఓ బాలయ్య, హెచ్ఎస్ ప్రమీల, సతీష్ కుమార్, ఎంఎల్‌హెచ్‌పీ ఆరిఫ్, నవీన్, సంతోష్‌లు పాల్గొన్నారు.



## యూరియా యాప్ విధానాన్ని రద్దు చేయాలి

- గ్రామాల వారీగా ఎరువుల సరఫరా చేయాలని రైతుల ధర్నా
- వ్యవసాయ అధికారులకు రైతుల వినతి

**ప్రజానావ, కామారెడ్డి:** యూరియా పంపిణీలో ప్రస్తుతం అమలవుతున్న యాప్ విధానాన్ని రద్దు చేసి, వచ్చే సాగు సీజన్ వరకు పాత విధానంలోనే రైతులకు యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డి జిల్లా భిక్నూర్ మండల కేంద్రంలో రైతులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బుధవారం ధర్నా నిర్వహించారు. మండల చౌరస్తాలో చేపట్టిన ఈ నిరసన కార్యక్రమంలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను వెల్లడించారు. యాప్ విధానం కారణంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, యూరియా పంపిణీ ప్రక్రియను సరళీకృతం చేయాలని కోరారు. అనంతరం వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీఏ)కు రైతుల తరఫున వినతి పత్రం సమర్పించారు. రెండో విడతగా వచ్చే యూరియాను మండల కేంద్రంలో ఒకేచోట పంపిణీ చేయకుండా, ఆయా గ్రామాలకు కేటాయించిన నిల్వలను సంబంధిత గ్రామ రైతులకే అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా యూరియా సరఫరా వ్యవస్థను మెరుగుపరచాలని, వ్యవసాయ అవసరాలకు తగినంత ఎరువులు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పోక్సో, హత్య కేసులో సంచలన తీర్పు

- నిందితుడికి 20 ఏళ్లు జైలు శిక్ష, హత్య కేసులో జీవిత ఖైదు
- పోలీసు-ప్రాసిక్యూషన్ సమన్వయంతో నిందితులకు వరుస శిక్షలు
- నిందుతుడికి శిక్ష పడటంలో కృషి చేసిన అధికారులను, పీపీ, సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ



**ప్రజానావ, సిరిసిల్ల :** రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి, వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్లలో నమోదైన రెండు కేసుల్లో మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన పోక్సో కేసుతో పాటు, అదే బాలిక హత్య కేసులో నిందితుడికి పొక్సో కేసులో 20 సంవత్సరాలు, హత్య కేసులో జీవిత ఖైదు విధిస్తూ సిరిసిల్ల పోక్సో కోర్టు ప్రధాన న్యాయమూర్తి రాధికా జైస్వాల్ బుధవారం తీర్పు వెల్లడించారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపిన వివరాల ప్రకారం.. కోడిమ్యాల్ మండలం శ్రీరాములపల్లి గ్రామనికి చెందిన బండపల్లి నవీన్ అనే వ్యక్తి చందుర్తి మండలం మూడపల్లి గ్రామానికి చెందిన మైనర్ బాలికను లైంగిక వేధింపులకి గురి చేసిన విషయంలో బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు చందుర్తి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి అప్పటి వేములవాడ డిఎస్పీ వెంకటరమణ దర్యాప్తు చేశారు. అనంతరం నిందితుడినీ రిమాండ్ కి తరలించి కోర్టులో చార్జిషీట్ ఫైల్ చేసారు. వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్లో నమోదైన అదే మైనర్ బాలిక హత్య కేసులో బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు అప్పటి వేములవాడ టౌన్ ఇన్స్పెక్టర్ వెంకటేష్ కోడిమ్యాల మండలం శ్రీరాములపల్లి గ్రామనికి చెందిన బండపల్లి నవీన్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం నిందితుడి రిమాండ్ చేసి కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేశారు.

**కోర్టు తీర్పు..**

కోర్టు విచారణలో భాగంగా అదనపు ఎస్పీ చంద్రయ్య పర్యవేక్షణలో కోర్టు మానిటరింగ్ ఎస్ఐ రవీందర్ నాయుడు ఆధ్వర్యంలో చందుర్తి, వేములవాడ కోర్టు కానిస్టేబుల్స్ లతీఫ్, మహేందర్, కోర్టు మానిటరింగ్ కానిస్టేబుల్ నవీన్, పొక్సో కోర్టు కానిస్టేబుల్ వెన్నెల కోర్టులో 15 మంది సాక్షులను ప్రవేశపెట్టగా ప్రాసిక్యూషన్ తరుపున గత పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెంట శ్రీనివాస్ వాదించగా, శాస్త్రీయ ఆధారాలు, సాక్ష్యాలు పరిశీలించిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో నిందితుడైన బండపల్లి నవీన్ కి పొక్సో కేసులో 20 సంవత్సరాలు జైలు శిక్ష, రూ.7000 జరిమాన, హత్య కేసులో జీవిత ఖైదు రూ.5000 లు జరిమాన విధించారు. సమాజంలో నేరం చెసిన వారు ఎవరు కుడా శిక్షల నుండి తప్పించుకోలేరని, శిక్షలతోనే సమాజంలో మార్పు వస్తుందని, పోలీసులు, ప్రాసిక్యూషన్ వారు వ్యూహాత్మకంగా న్యాయ నిరూపణ, న్యాయ విచారణ జరిపి శిక్షలు పడేలా చెస్తారని సూచించారు. ఈ కేసులలో పకడ్బందీగా దర్యాప్తు జరిపి నిందితుడికి శిక్ష పడేలా కృషి చెసిన పొక్సో కేసులో అప్పటి విచారణ అధికారి డిఎస్పీ వెంకటరమణ, ప్రస్తుత డిఎస్పీ శ్రీనివాసులు, ఎస్ఐ రమేష్, హత్య కేసులో అప్పటి విచారణ అధికారి ఇన్స్పెక్టర్ వెంకటేష్, ప్రస్తుత ఇన్స్పెక్టర్ వీరప్రసాద్, గత పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెంట శ్రీనివాస్, కోర్టు మానిటరింగ్ ఎస్ఐ రవీందర్ నాయుడు, కోర్టు కానిస్టేబుల్స్ మహేందర్, లతీఫ్, కోర్టు మానిటరింగ్ కానిస్టేబుల్ నవీన్, పొక్సో కోర్టు కానిస్టేబుల్ వెన్నెల లను జిల్లా ఎస్పీ అభినందిచారు. మైనర్లపై నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని, ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా జిల్లా పోలీస్ యంత్రాంగం కట్టుబడి ఉందన్నారు.



## ఎరువుల దుకాణాలపై ఆకస్మిక దాడులు

**జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం**

**ప్రజానావ, సిరిసిల్ల :** తంగళ్ళపల్లి మండలంలోని పలు ఎరువుల దుకాణాలపై బుధవారం అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి అబ్జల్ బేగం వివరాలను వెల్లడించారు. రెండు రోజుల్లో యూరియా యాప్ ద్వారా అమ్మకాలు ప్రారంభమైతాయని, దీనికి సంబంధించి ప్రతి షాప్‌లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రైతులకు ఏవైనా సందేహాలు ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 18001237157కు ఫోన్ చేయాలన్నారు. సన్నాల యాజమాన్యాలకు సంబంధించి ఫ్లెక్సీలు కూడా ప్రతి షాపు లో అమర్చాలని సూచించారు. ఈ తనిఖీల్లో జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, మండల వ్యవసాయ అధికారి కే సంజీవ్ పాల్గొన్నారు.

# అరుదైన ఘనత సాధించిన శ్వేష్టరెడ్డి

- ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్న చిన్నారి






**ప్రజానావ, జగిత్యాల :** జగిత్యాల పట్టణానికి చెందిన లంకన్నగారి శ్వేష్టరెడ్డి అనే రెండేళ్ల 11 నెలల 22 రోజుల చిన్నారి అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. భారతదేశంలోని 28 రాష్ట్రా లు, 8 కేంద్ర పాలిత ప్రాంతాల రాజధానులను కేవలం ఒక నిమిషంలో గుర్తుచెప్పి, అత్యంత వేగంగా చెప్పిన చిన్నారిగా ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకుంది. 2023 జూన్ 17న హైదరాబాద్‌లో జన్మించిన శ్వేష్ట రెడ్డి, జగి త్యాలకు చెందిన బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీ నారాయణ, పద్మలతల మనుమరాలు. ఈ ఘనతను ఆమె 2026 జూన్ 8న సాధించగా, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ అదే రోజున అధికారికంగా ధృవీకరించింది. ఇటీవల ఆమెకు ఐబీఆర్ అచీవర్ సర్టిఫికెట్‌తో పాటు మెడల్‌ను అందజేశారు. 'ఫాస్టెస్ట్ టాడ్లర్ టు రీకాల్ క్యాపిటల్స్ ఆఫ్ ఆల్ ఇండియన్ స్టేట్స్ అండ్ యూనియన్ టెరిటరీస్' విభాగంలో ఈ గుర్తింపు లభించింది. చిన్న వయసులోనే అసాధా రణ జ్ఞాపకశక్తిని ప్రదర్శించిన శ్వేష్ట రెడ్డి సాధించిన ఈ ఘనత రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచింది. ఈ సందర్భంగా చిన్నారి తల్లిదండ్రులు వేధస్విని, పవన్ ఆనందం వ్యక్తం చేశారు. "శ్వేష్టకు చిన్నప్ప టి నుంచే మ్యాప్స్, రాష్ట్రాల పేర్లపై ఆసక్తి ఉండేది. ఆటగా ప్రారంభమైన ఈ అభ్యాసం, ప్రతిరోజూ సాధన చేయడంతో రికార్డు స్థాయికి చేరుకుంది. మా కూతురు సాధించిన ఘనతపై ఎంతో గర్వంగా ఉంది" అని తెలిపారు. అలాగే అమ్మమ్మ, తాత ముసిపట్ల లక్ష్మీ నారాయణ, పద్మలత మాట్లాడుతూ, "శ్వేష్ట సాధించిన విజయం మా కుటుంబానికే కాకుండా తెలంగాణ రాష్ట్రానికి కూడా గర్వకారణం. ఉపాధ్యాయులు, బంధువులు అందించిన ప్రోత్సాహంతోనే ఇది సాధ్యమైంది. భవిష్యత్తులో ఆమె మరిన్ని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షిస్తున్నాం" అని పేర్కొన్నారు.

# భద్రకాళీ ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ

- అభినవోద్దండ విద్యాశంకర భారతీ స్వామి చేతులమీదుగా ప్రతిష్ఠాపన
- పది వేల మందికి పైగా పాల్గొన్న భక్తులు, అన్నప్రసాద వితరణ



**ప్రజానావ, వరంగల్ :** వరంగల్‌లోని శ్రీ భద్రకాళీ దేవస్థానంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని శ్రీ అభినవోద్దండ విద్యాశంకర భారతీ స్వామి చేతుల మీదుగా శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ వేడుకలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి దంపతులు, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఇరిగేషన్ ఎస్ఈ హరివెంకటరామ ప్రసాద్, ప్రముఖ దాతలు తొొట్టెడ్డి హృదయ్ కుమార్ రెడ్డి–అర్చన దంపతులు, దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ కృష్ణప్రసాద్, పలువురు దాతలు, ఆలయ ధర్మకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. దేవస్థానం చైర్మన్ డా. బి. శివసుబ్రహ్మణ్యం, ధర్మకర్తలు, ఆలయ అధికారులు, భక్తుల సమక్షంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దాదాపు 10 వేల మంది భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో దర్శనం చేసుకున్నారు. ప్రతిష్ఠాపన అనంతరం భద్రకాళీ భక్త సేవా సమితి కన్వీనర్ అయితా గోపీనాథ్ ఆధ్వర్యంలో ఆలయానికి విచ్చేసిన భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. భద్రకాళి శేషు సమన్వయంతో ఆలయ అర్చకులు, వేదపండితులు, వేదపాఠశాల విద్యార్థులు, ఆగమ శాస్త్ర పండితులు గుమడవెల్లి గణేశ్ ఆత్రేయ శర్మ ఆధ్వర్యంలో ఉత్సవాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రతిష్ఠించిన ధ్వజస్తంభాన్ని దర్శించిన భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. ఆలయం అంతా ఆధ్యాత్మిక వాతావరణంతో మారుమ్రోగగా, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో రామల సునీత పర్యవేక్షణలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

# సమాన, స్థిరమైన ఆర్థికవృద్ధిపై దృష్టిపెట్టాలి

- జీడీపీ గణాంకాలకు అతీతంగా వృద్ధిపై చర్చలు జరగాలి
- ఇంధన సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు అంతర్జాతీయ సహకారం అవసరం
- అభివృద్ధి చెందుతున్న దేశాలకు ప్రపంచం అండగా నిలవాలి
- జీ-7 సదస్సులో ప్రధాని మోదీ
- మానవ వనరులను ప్రపంచ అభివృద్ధిలో భాగం చేయాలని సూచన



**ప్యారిస్:** జీడీపీ, వాణిజ్య గణాంకాలకు మాత్రమే పరిమితం కాకుండా సమానమైన, స్థిరమైన ఆర్థిక వృద్ధిపై ప్రపంచ దేశాలు దృష్టి సారించాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఫ్రాన్స్‌లోని ఎవియాన్-లే-బేలో బుధవారం జరిగిన జీ-7 కూటమి దేశాల సమావేశంలో ఆయన ఈ మేరకు కీలక వ్యాఖ్యలు చేశారు. 'అందరికీ సమానమైన, స్థిరమైన ఆర్థిక వృద్ధి' అంశంపై చర్చ జరగడం స్వాగతించదగ్గ విషయమని పేర్కొన్న మోదీ.. అభివృద్ధి గురించి మాట్లాడేటప్పుడు కేవలం జీడీపీ, వాణిజ్య గణాంకాలను మాత్రమే ప్రమాణంగా తీసుకోకూడదన్నారు. ''వృద్ధి ఎవరిది, ఎవరికి ప్రయోజనం చేకూరుస్తోంది, ఏ దిశగా సాగుతోంది అనే అంశాలపై కూడా లోతైన చర్చలు జరగాలి'' అని ఆయన అన్నారు. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఇంధన సంక్షోభాన్ని ప్రస్తావిస్తూ, ఆర్థికంగా వెనుకబడిన దేశాలను వారి పరిస్థితికి వదిలేయకుండా అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు సహకరించాలని ప్రధాని సూచించారు. అభివృద్ధి చెందుతున్న దేశాలు ఇలాంటి సంక్షోభాలను తట్టుకునేలా బలమైన వ్యవస్థలను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఆ దేశాల్లోని మానవ వనరులను ప్రపంచ అభివృద్ధిలో భాగస్వామ్యం చేయాలని మోదీ సూచించారు. ఇంధనం, ఆహారం, ఆరోగ్యం, సైబర్ భద్రత, ఆర్థిక వ్యవస్థలు పరస్పరం అనుసంధానమై ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో మానవాళి పురోగతి, శ్రేయస్సు కోసం అంతర్జాతీ య భాగస్వామ్యాలు అత్యవసరమని ఆయన పేర్కొన్నారు. ఫ్రాన్స్ ఆతిథ్యమిస్తున్న ఈ జీ-7 సదస్సుకు ఆ దేశ ఆహ్వానం మేరకు ప్రధాని మోదీ హాజరయ్యారు. జీ-7 కూటమిలో కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, బ్రిటన్, అమెరికా సభ్య దేశాలుగా ఉండగా, యూరోపియన్ యూనియన్ కూడా ఈ సమావేశంలో ప్రాతినిధ్యం వహిస్తోంది.

# పుల్వామా తరహాలో మరో స్కెచ్

- ఏడుగురు ఐఎస్ఐ ఉగ్రవాదుల ముఠా అరెస్ట్
- భారత సైనికుల కదలికలపై నిఘా పెట్టేందుకు యత్నం

**న్యూఢిల్లీ:** పాకిస్థాన్ గూఢచారి సంస్థ ఐఎస్ఐ మద్దతుతో భారత్‌లో కార్యకలాపాలు సాగిస్తున్న అంతర్జాతీయ ఉగ్ర నెట్‌వర్క్‌ను ఢిల్లీ పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ఏడుగురిని అరెస్టు చేయగా, వారిలో ఆరుగురు ఉత్తరప్రదేశ్‌లోని గాజియాబాద్‌కు చెందిన వారిగా గుర్తించారు. అరెస్టయిన ఆరుగురిలో నలుగురు గతంలో పుల్వామా ప్రాంతాన్ని సందర్శించినట్లు దర్యాప్తు లో వెల్లడైంది. అక్కడి నుంచి సున్నితమైన సమాచారాన్ని పాకిస్థాన్‌కు చేరవేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. పుల్వామా తరహాలో మరో పెద్ద దాడికి పాకిస్థాన్ కుట్ర పన్నుతోందా అనే కోణంలో విచారణ కొనసాగుతోంది. ఈ ముఠా ఢిల్లీ నుంచి జమ్మూ వరకు ఉన్న ప్రధాన రైల్వే స్టేషన్ల వద్ద సోలార్ ఆధారిత సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి భారత సైనికుల కదలికలపై నిఘా పెట్టేందుకు ప్రయత్నించినట్లు పోలీసులు వెల్లడించారు. ఇప్పటికే ఢిల్లీ కాంట్, హరియాణాలోని సోనిపట్ రైల్వే స్టేషన్ల వద్ద ఇటువంటి కెమెరా లను ఏర్పాటు చేసినట్లు గుర్తించినట్లు తెలిపారు. దర్యాప్తులో మరో కీలక అంశం కూడా వెలుగు లోకి వచ్చింది. భారతీయ మొబైల్ నంబర్లకు వచ్చే ఓటీపీలను విదేశాల్లో ఉన్న వ్యక్తులకు పంపిస్తూ, వాట్సాప్ మరియు ఇతర సామాజిక మాధ్యమ ఖాతాల నిర్వహణకు నిందితులు సహకరించినట్లు పోలీసులు గుర్తించారు. ఇందుకోసం ఒక్కో సేవకు రూ.500 నుంచి రూ.5 వేల వరకు వసూలు చేసినట్లు సమాచారం. సిమ్ కార్డుల చోరీ, ఇప్పటికే యాక్టివేట్ అయిన సిమ్‌ల కొనుగోలు వంటి అక్రమ మార్గాలను వారు ఉపయోగించినట్లు దర్యాప్తులో తేలింది. ఆర్థిక లావాదేవీలను తమ వ్యక్తిగత బ్యాంకు ఖాతాల ద్వారా కాకుండా జనసేవా కేంద్రాలు, స్థానిక దుకాణాల ద్వారా నగదు రూపంలో స్వీకరించి పోలీసుల కళ్లుగప్పేందుకు ప్రయత్నించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కేసులో మరికొందరి ప్రమేయంపై కూడా దర్యాప్తు కొనసాగుతోందని, దేశ భద్రతకు ముప్పుగా మారే ఇలాంటి నెట్‌వర్క్‌లపై కఠిన చర్యలు తీసుకుంటామని ఢిల్లీ పోలీసులు స్పష్టం చేశారు.

# టెలిగ్రామ్ నిషేధంపై రాజకీయ దుమారం

- నీట్-యూజీ రీ-ఎగ్జామ్ నేపథ్యంలో కేంద్ర నిర్ణయంపై ప్రతిపక్షాల విమర్శలు
- పేపర్ లీక్‌లను అరికట్టడంలో విఫలమై విద్యార్థులను శిక్షిస్తున్నారని ఆరోపణ
- ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన టెలిగ్రామ్
- 15 కోట్ల మంది వినియోగదారులపై ప్రభావం పడుతుందని పావెల్ దురోవ్



**న్యూఢిల్లీ:** నీట్-యూజీ రీ-ఎగ్జామ్ నేపథ్యంలో టెలిగ్రామ్ యాప్‌ను తాత్కాలికంగా నిషేధించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం రాజకీయ దుమారానికి దారితీసింది. కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సహా పలువురు ప్రతిపక్ష నాయకులు ఈ నిర్ణయాన్ని తీవ్రంగా విమర్శించారు. పేపర్ లీక్‌లను అరికట్టడంలో విఫలమైన ప్రభుత్వం విద్యార్థులను లక్ష్యంగా చేసుకుంటోందని ఆరోపించారు. ఈ అంశంపై సామాజిక మాధ్యమం ద్వారా స్పందించిన రాహుల్ గాంధీ, పేపర్ లీక్ మాఫియాపై చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం టెలిగ్రామ్‌ను నిషేధించడం సమస్యకు పరిష్కారం కాదని అన్నారు. దొంగలను పట్టుకోలేక బాధితుల తలుపులకు తాళం వేయడంలా ఈ చర్య ఉంది. లక్షలాది మంది విద్యార్థులు టెలిగ్రామ్ ద్వారా నోట్స్, టెస్ట్ సిరీస్‌లు, చర్చలతో తమ చదువును కొనసాగిస్తున్నారు. అలాంటి సౌకర్యాన్ని నిలిపివేయడం వల్ల పేపర్ లీక్‌లు ఎలా ఆగుతా యి? అని ప్రశ్నించారు. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కూడా కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుబట్టారు. ఈ రోజు టెలిగ్రామ్‌ను నిషేధించారు. రేపు వాట్సాప్‌ను కూడా నిషేధిస్తారా? అంటూ ఆయన ప్రశ్నించారు. ఇదిలా ఉండగా, కేంద్ర నిర్ణయాన్ని సవాలు చేస్తూ టెలిగ్రామ్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. ఈ చర్యపై టెలిగ్రామ్ వ్యవస్థాపకుడు పావెల్ దురోవ్ కూడా అభ్యంతరం వ్యక్తం చేశారు. టెలిగ్రామ్‌పై నిషేధం విధించడం ద్వారా 15 కోట్లకు పైగా భారతీయ వినియోగదారులను శిక్షిస్తున్నట్లవు తుంది. ఈ చర్యతో పేపర్ లీక్‌లను పూర్తిగా అరికట్టడం సాధ్యం కాదు అని ఆయన వ్యాఖ్యానించారు. టెలిగ్రామ్‌పై తాత్కాలిక నిషేధానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఇంకా అధికారికంగా పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది.

# స్పేస్‌ఎక్స్ షేర్ల జోరు

- ఒక్కరోజే ముకేశ్ అంబానీ మొత్తం సంపదను మించి పెరుగుదల
- ట్రిలియన్ డాలర్ల మార్కును దాటిన ఎలాన్ మస్క్ నికర సంపదపై ప్రపంచవ్యాప్తంగా చర్చ




**న్యూయార్క్:** ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన అంతరిక్ష సాంకేతిక సంస్థ స్పేస్‌ఎక్స్ షేర్లు రాకెట్ వేగంతో దూసుకెళ్తున్నాయి. ప్రారంభ ప్రజా వాటాల విక్రయంలో ఒక్కో షేరు ధర 135 డాలర్లుగా నిర్ణయించగా, అనంతరం వాటి ధర 200 డాలర్ల మార్కును దాటడంతో సంస్థ మార్కెట్ విలువతో పాటు మస్క్ వ్యక్తిగత సంపద కూడా భారీగా పెరిగింది. ఇటీవల జరిగిన ట్రేడింగ్‌లో స్పేస్‌ఎక్స్ షేర్లు ఒకే రోజులో 14.71 శాతం మేర లాభపడటంతో ఎలాన్ మస్క్ సంపద 164.8 బిలియన్ డాలర్ల మేర పెరిగినట్లు అంచనా. ఈ ఒక్కరోజు పెరుగుదలే భారతీయ పారిశ్రామిక దిగ్గజం ముకేశ్ అంబానీ మొత్తం నికర ఆస్తుల విలువ కంటే దాదాపు రెట్టింపు కావడం విశేషంగా మారింది. ప్రస్తుతం ఎలాన్ మస్క్ నికర సంపద 1.3 ట్రిలియన్ డాలర్లకు చేరినట్లు అంతర్జాతీయ ఆర్థిక వర్గాలు పేర్కొంటు న్నాయి. టెస్లా, స్పేస్‌ఎక్స్ సంస్థల్లో ఆయనకున్న వాటాలే ప్రధాన సంపదకు ఆధారంగా నిలుస్తున్నాయి. మరోవైపు, అదే రోజున ముకేశ్ అంబా నీకి చెందిన కంపెనీల షేర్లు కూడా లాభాల్లో ముగియడంతో ఆయన ఆస్తుల విలువ 965 మిలియన్ డాలర్ల మేర పెరిగింది. అయితే మస్క్ సంపద పెరుగుదలతో పోలిస్తే ఇది చాలా తక్కువగా ఉండటంతో సామా జిక మాధ్యమాల్లో విస్తృత చర్చ సాగుతోంది. కొంతమంది నెటిజన్లు ఆసక్తికరమైన పోలికలను ప్రస్తావిస్తున్నారు. భారతదేశ స్థూల దేశీయోత్పత్తి విలువ సుమారు 4.15 ట్రిలియన్ డాలర్లుగా ఉండగా, ఎలాన్ మస్క్ వ్యక్తిగత సంపద దానిలో నాలుగో వంతుకు సమా నంగా ఉందని వ్యాఖ్యా నిస్తున్నారు. గత శుక్రవారం నాస్‌డాక్ మార్కెట్‌లో స్పేస్‌ఎక్స్ షేరు 150 డాలర్ల వద్ద లిస్టింగ్ అయింది. ఇది ప్రారంభ ప్రజా వాటాల విక్రయ ధరతో పోలిస్తే సుమారు 11 శాతం అధికం. ఈ సంస్థలో మస్క్‌కు సుమారు 480 కోట్ల షేర్లు ఉండటంతో ఆయన వ్యక్తిగత సంపద ట్రిలియన్ డాలర్ల మైలురాయిని అధిగమించింది. ఇదిలాఉంటే ఎలాన్ మస్క్ సంపద పెరుగుదల ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఒక ట్రిలియన్ డాలర్లు అంటే 10 లక్షల కోట్ల డాలర్లకు సమానమని, ప్రతి గంటకు 10 లక్షల డాలర్లు ఖర్చు చేసినా 2140 సంవత్సరం వరకు ఆయన సంపద పూర్తిగా ఖర్చు కాదని నెటిజన్లు ఆసక్తికర లెక్కలు వేస్తున్నారు.

# ఇండో-పసిఫిక్‌కు వీడ్కోలు?

**అమెరికా కీలక సైనిక కమాండ్‌కు మళ్లీ 'పసిఫిక్ కమాండ్' పేరు**

**వాషింగ్టన్:** ఫ్రాన్స్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత ప్రధాని నరేంద్ర మోదీ మధ్య ద్వైపాక్షిక భేటీ జరుగుతున్న సమయంలో చోటు చేసుకున్న ఒక కీలక పరిణామం ఇరు దేశాల మధ్య చర్చనీయాంశంగా మారింది. అమెరికా తన ప్రధాన సైనిక విభాగమైన 'యూఎస్ ఇండో-పసిఫిక్ కమాండ్' పేరును మార్చి, మళ్లీ 'యునైటెడ్ స్టేట్స్ పసిఫిక్ కమాండ్'గా నామకరణం చేసింది. ఈ కమాండ్ పరిధిలోని ప్రాంతాలను వివరిస్తూ అమెరికా రక్షణ శాఖ తన అధికారిక వెబ్‌సైట్‌లో ఒక మ్యాప్‌ను ప్రచురించింది. ఆ మ్యాప్‌లో పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) ప్రాంతాన్ని పాకిస్థాన్‌లో భాగంగా చూపించడంతో వివాదం చెలరేగింది. ఈ అంశంపై భారత వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే కమాండ్ పేరులో చేసిన మార్పు చారిత్రక వారసత్వాన్ని పునరుద్ధరించడంలో భాగమేనని అమెరికా రక్షణ శాఖ స్పష్టం చేసింది. అయితే డొనాల్డ్ ట్రంప్ తొలి అధ్యక్ష పదవీకాలంలో, 2018లో ఈ కమాండ్‌కు 'యూఎస్ ఇండో-పసిఫిక్ కమాండ్'గా పేరు మార్చారు. భారతదేశానికి పెరుగుతున్న వ్యూహాత్మక ప్రాధాన్యాన్ని ప్రతిబింబించేలా ఈ మార్పు చేపట్టినట్లు అప్పట్లో భావించారు. ఎనిమిదేళ్ల అనంతరం మళ్లీ పాత పేరును పునరుద్ధరించడం అంతర్జాతీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# వైట్‌హౌస్‌పై ఉగ్రదాడి కుట్ర భగ్నం

- టంప్ పుట్టినరోజు సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాన్ని లక్ష్యంగా చేసుకున్న దుండగులు
- డ్రోన్లు, స్నైపర్లతో దాడికి ప్రణాళిక.. ఐదుగురి అరెస్టు
- నిందితుడి తల్లి ఇచ్చిన సమాచారంతో ఎఫ్‌బీఐ అప్రమత్తం



**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్ష భవనమైన వైట్‌హౌస్‌పై భారీ ఉగ్రదాడి జరిపేందుకు పన్నిన కుట్రను ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) భగ్నం చేసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 80వ జన్మదినం సందర్భంగా వైట్‌హౌస్‌లో నిర్వహించిన యూఎఫ్‌సీ కార్యక్రమాన్ని లక్ష్యంగా చేసుకుని కొందరు వ్యక్తులు డ్రోన్లు, స్నైపర్లతో దాడికి ప్రణాళిక రచించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కేసులో ఇప్పటి వరకు ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎఫ్‌బీఐ తెలిపింది. అరెస్టయిన వారిలో 19 ఏళ్ల టైసెన్ ప్రాపర్ అనే యువకుడి తల్లి అందించిన సమాచారంతోనే ఈ కుట్రను ముందుగానే గుర్తించి భగ్నం చేయగలిగినట్లు అధికారులు పేర్కొన్నారు. భారీ స్థాయిలో ఆయుధాల కొనుగోలు, గూఢచర్య కార్యకలా పాలు, హిట్ అండ్ రన్ విధానాలపై తన కుమారుడు కొందరి తో చర్చిస్తున్నట్లు గమనించిన ఆమె అనుమానం తో స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎఫ్‌బీఐ రంగంలోకి దిగి నిందితులను అదుపులోకి తీసుకుంది. ఎఫ్‌బీఐ అధికారుల వివరాల ప్రకారం, పేలుడు పదార్థాలు అమర్చిన డ్రోన్లతో వైట్‌హౌస్ సమీపంలోని భవనాలపై దాడి చేసి, అనంతరం అక్కడి నుంచి బయటకు పరుగు లు తీసే ప్రజలను స్నైపర్లతో లక్ష్యంగా చేసుకో వాలని నిందితులు ప్రణాళిక రూపొందించారు. ఈ కుట్రకు సంబంధించిన సమాచారాన్ని కొందరు నిందితులు ఎన్‌క్రిప్టెడ్ మెసేజింగ్ యాప్‌ల ద్వారా పరస్పరం పంచుకు న్నట్లు దర్యా ప్తులో వెల్లడైంది. ఈ ఘటనను ఎఫ్ బీఐ డైరెక్టర్ కాశ్ పటేల్ ఒక భారీ ఉగ్రదాడి కుట్రగా అభివ ర్ణించారు. సరైన సమయంలో చర్యలు తీసుకోక పోయి ఉంటే తీవ్ర ప్రాణనష్టం సంభవించే అవకాశం ఉండేదని ఆయ న పేర్కొన్నారు. దర్యాప్తులో భాగంగా అరెస్టయిన వ్యక్తులకు పర స్పరం ప్రత్య క్ష సంబంధాలు లేవని అధికారులు తెలిపారు. ప్రభుత్వ వ్యతిరేక భావ జాలంతో పాటు, లైంగిక నేరస్థుడు జెఫ్రీ ఎప్‌స్టీన్‌కు సంబంధించిన దస్త్రాల వ్యవహారంలో ట్రంప్ యంత్రాంగం వైఖరిపై అసంతృప్తి చెందిన వ్యక్తులే ఈ కుట్రలో పాల్గొన్నట్లు అనుమానిస్తు న్నట్లు వెల్లడించారు. యూదు వ్యతిరేక భావజా లం కూడా వీరిలో ఉన్నట్లు అధికారులు పేర్కొ న్నారు. ప్రస్తుతం నిందితులపై పలు కేసులు నమో దు చేసి, మరింత లోతుగా విచారణ కొనసా గిస్తున్నట్లు ఎఫ్‌బీఐ అధికారులు వెల్లడించారు.

# ఉద్ధవ్ ఠాక్రేకు మరోసారి సంక్షోభం?

- శిందే శివసేనలోకి ఎంపీల చేరికపై ఊహాగానాలు
- 'ద్రోహులు ముందుగా రాజీనామా చేయాలి' అంటూ సంజయ్ రౌత్ ఘాటు వ్యాఖ్యలు



**ముంబై:** మహారాష్ట్ర మాజీ ముఖ్య మంత్రి ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన (యూబీటీ) మరోసారి రాజకీయ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నట్లు సంకేతాలు కనిపిస్తున్నాయి. పార్టీకి చెందిన పలువురు ఎంపీలు ఏక్‌నాథ్ శిందే నేతృత్వంలోని శివసేనలో చేరనున్నారన్న వార్తలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఈ నేపథ్యంలో శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ ఢిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశానికి కేవలం ముగ్గురు ఎంపీలు మాత్రమే హాజరు కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సందర్భంగా ఆయన పార్టీని వీడే నేతలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ''ద్రోహులు పార్టీని వీడాలనుకుంటే ముందుగా రాజీనామా చేయాలి. పార్టీ టికెట్‌పై గెలిచి ప్రజల తీర్పును మోసం చేసే హక్కు ఎవరికీ లేదు'' అని సంజయ్ రౌత్ వ్యాఖ్యానించారు. కొందరు ఎంపీలను పార్టీ మారేందుకు రూ.50 కోట్ల వరకు ప్రలోభాలకు గురిచేస్తున్నట్లు సమాచారం ఉందని ఆరోపించారు. అయితే, పార్టీ చీలికకు సంబంధించి తమకు అధికారికంగా ఎలాంటి సమాచారం అందలేదని, మీడియాలో వస్తున్న కథనాల ద్వారానే ఈ విషయాన్ని తెలుసుకున్నామని తెలిపారు. ఈ పరిణామాల నేపథ్యంలో శివసేన (యూబీటీ) చట్టపరమైన చర్యలు ప్రారంభించినట్లు రౌత్ వెల్లడించారు. పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్‌లోనూ ఇలాంటి పరిస్థితులు నెలకొన్నాయని ఆయన ప్రస్తావించారు. పార్టీలు తరచూ చీలిపోతుంటే ఎన్నికల్లో పోటీ చేయడానికే అర్థం ఉండదని వ్యాఖ్యానించారు. 2022లో జరిగిన తిరుగుబాటు తరహా పరిస్థితులు మరోసారి పునరావృతమైతే మహారాష్ట్ర ప్రజలు సహించరని సంజయ్ రౌత్ హెచ్చరించారు. 2022లో శివసేన రెండు వర్గాలుగా చీలిపోయిన విషయం తెలిసిందే. ఆ సమయంలో పార్టీ పేరు, ఎన్నికల గుర్తు ఏక్‌నాథ్ శిందే వర్గానికి దక్కగా, ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని వర్గం 'శివసేన (యూబీటీ)' పేరుతో కొనసాగుతోంది. ప్రస్తుతం లోక్‌సభలో శివసేన (యూబీటీ)కి తొమ్మిది మంది ఎంపీలు ఉన్నారు. తాజా పరిణామాలు మహారాష్ట్ర రాజకీయాల్లో మరోసారి ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

## పాఠశాల తొలిరోజే 16 కి.మీ. పరుగెత్తిన బాలుడు

- మొబైల్ ఫోన్‌ల వ్యసనానికి దూరంగా ఉండి శారీరక దృఢత్వం పెంపుపై అవగాహన

**ప్రజానావ, ముంబై:** మహారాష్ట్రలోని లాతూర్ జిల్లాకు చెందిన 10 ఏళ్ల అరవింద్ రాథోడ్ పాఠశాల ప్రారంభమైన తొలి రోజే 16 కిలోమీటర్లు పరుగెత్తి అందరి ప్రశంసలు అందుకున్నాడు. చెరకు కూలీ కుటుంబానికి చెందిన అరవింద్, 'మాజా ఘర్' ఆశ్రమం నుంచి శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి పాఠశాల వరకు పరుగెత్తుకుంటూ వెళ్లి గుర్తింపు పొందాడు. మొబైల్ ఫోన్‌ల వ్యసనానికి దూరంగా ఉండడంతో పాటు శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలనే సందేశాన్ని సమాజానికి అందించేందుకు ఈ పరుగు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. చిన్న వయసులోనే అరవింద్ చూపిన పట్టుదల, క్రమశిక్షణ అందరినీ ఆకట్టుకుంది. పాఠశాలకు చేరుకున్న అనంతరం అరవింద్‌కు స్థానికులు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యం స్వాగతం పలికారు.

# సైబర్ నేరస్థులు పరాన్నజీవులు

- ఇలాంటి నేరాలపై మరింత కఠినంగా వ్యవహరించాలి: సుప్రీంకోర్టు
- సైబర్ మోసాల కేసులో నిందితుడికి బెయిల్ నిరాకరణ
- దేశవ్యాప్తంగా పెరుగుతున్న డిజిటల్ మోసాలపై ఆందోళన
- గతేడాది రూ.3 వేల కోట్లకు పైగా నష్టం వాటిల్లిందన్న అత్యున్నత న్యాయస్థానం



**న్యూఢిల్లీ:** అమాయక ప్రజలను మోసగించి కోట్లాది రూపాయలు దోచుకుంటున్న సైబర్ నేరస్థులు పరాన్నజీవుల వంటివారని సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఇలాంటి నేరాలకు పాల్పడుతున్న వారిపై చట్టాలను మరింత కఠినతరం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. ఓ సైబర్ మోసాల కేసులో నిందితుడికి బెయిల్ నిరాకరిస్తూ దాఖలైన పిటిషన్‌ను తిరస్కరించిన సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ సందర్భంగా దేశంలో పెరుగుతున్న సైబర్ నేరాలపై ఆందోళన వ్యక్తం చేసింది. భారీ లాభాలు వస్తాయని ఆశ చూపించి ప్రజలను మోసగించే వ్యక్తులు సమాజానికి ప్రమాదకరమని పేర్కొంది. ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసి మోసాలకు పాల్పడుతున్న వారు పరాన్నజీవుల వంటివారు. ఇలాంటి వారు జైల్లో ఉండటమే సమాజానికి శ్రేయస్కరం. సైబర్ నేరస్థ విషయంలో మరింత కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. ఈ తరహా నేరాలు రెండు... ఒక రాష్ట్రంలో ఒకరిని, మరో రాష్ట్రంలో ఇంకొకరిని లక్ష్యంగా చేసుకుని డబ్బులు కాజేస్తున్నారు అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. విచారణ సందర్భంగా కోర్టు ముందు ఉంచిన వివరాలను ప్రస్తావిస్తూ, గత ఏడాది చివరి నాటికి దేశంలో డిజిటల్ మోసాల కారణంగా రూ.3 వేల కోట్లకు పైగా నష్టం సంభవించినట్లు సుప్రీంకోర్టు పేర్కొంది. ఇది సైబర్ నేరాల తీవ్రతను స్పష్టంగా తెలియజేస్తోందని వ్యాఖ్యానించింది. ఇదిలా ఉండగా, నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీ ఆర్‌బీ) గణాంకాల ప్రకారం, 2021 నుంచి 2023 మధ్య దేశంలో సైబర్ నేరాలు సుమారు 63 శాతం పెరిగి, కేసుల సంఖ్య 86 వేల మార్కు ను దాటినట్లు వెల్లడైంది. సైబర్ మోసాల నమో దులో కర్ణాటక మొదటి స్థానంలో ఉండగా, తెలంగాణ, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర తదుపరి స్థానాల్లో ఉన్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయి.

## 20న రైతుల ఖాతాల్లో పీఎం కిసాన్ నిధులు

- 23వ విడతగా ఒక్కో రైతుకు రూ.2,000 జమ

**న్యూఢిల్లీ :** రైతులకు పెట్టుబడి సాయంగా అందిస్తున్న ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం-కిసాన్) పథకం కింద 23వ విడత నిధుల విడుదలకు కేంద్ర ప్రభుత్వం తేదీ ఖరారు చేసింది. జూన్ 20న దేశవ్యాప్తంగా అర్హులైన రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.2,000 చొప్పున జమ కానున్నాయి. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని హుగ్లీ జిల్లా తారకేశ్వర్‌లో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నిధులను విడుదల చేయనున్నారు. దీంతో కోట్లాది మంది రైతులు నేరుగా తమ ఖాతాల్లో ఆర్థిక సహాయాన్ని పొందనున్నారు. వ్యవసాయ రంగానికి ప్రోత్సాహం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం-కిసాన్ పథకం ద్వారా ప్రతి ఏడాది మూడు విడతలుగా రైతులకు ఆర్థిక సాయం అందిస్తున్న విషయం తెలిసిందే. ఈ పథకం కింద సంవత్సరానికి మొత్తం రూ.6,000ను మూడు విడతలుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తోంది.

# డబుల్ ధమాకా!

## అఫ్గాన్‌పై సెంచరీలు బాదిన శుభ్‌మన్ గిల్, ఇషాన్ కిషన్

- రెండో వన్డేలో భారత్ భారీ విజయం
- మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్ కైవసం

**లక్నో:** అఫ్గానిస్థాన్‌తో జరుగుతున్న మూడు వన్డేల సిరీస్‌లో టీమిండియా మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్‌ను కైవసం చేసుకుంది. బుధవారం లక్నో వేదికగా జరిగిన రెండో వన్డేలో అన్ని విభాగాల్లోనూ ఆధిపత్యం చెలాయించిన భారత్ 170 పరుగుల భారీ తేడాతో అఫ్గానిస్థాన్‌ను చిత్తుచేసి 2-0తో ఆధిక్యాన్ని సాధించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 49.5 ఓవర్లలో 402 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 110 బంతుల్లో 22 ఫోర్లు, రెండు సిక్సర్లతో 154 పరుగులు చేసి అద్భుత శతకం నమోదు చేశాడు. యువ బ్యాటర్ ఇషాన్ కిషన్ 79 బంతుల్లో 14 ఫోర్లు, ఏడు సిక్సర్ల సాయంతో 125 పరుగులు చేసి మరోసారి తన ప్రతిభను చాటుకున్నాడు. రోహిత్ శర్మ 39 బంతుల్లో ఆరు ఫోర్లు, రెండు సిక్సర్లతో 48 పరుగులు చేసి అర్ధశతకాన్ని త్రుటిలో చేజార్చుకున్నాడు. అఫ్గానిస్థాన్ బౌలర్లలో ఖరోటే నాలుగు వికెట్లు పడగొట్టగా, రషీద్ ఖాన్ మూడు వికెట్లు దక్కించుకున్నాడు. అల్లా ఘజన్‌ఫర్, మహమ్మద్ సలీమ్ చెరో వికెట్ సాధించారు. 403 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన అఫ్గానిస్థాన్ 44.3 ఓవర్లలో 232 పరుగులకు కుప్పకూలింది. రెహ్మత్ షా 79 పరుగులతో ఒంటరి పోరాటం చేయగా, రెహ్మనుల్లా గుర్బాజ్ 41, సెదిఖుల్లా అటల్ 42 పరుగులతో ఫర్వాలేదనిపించారు. దార్విష్ రసూలి గాయంతో రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగి మళ్లీ బ్యాటింగ్‌కు రాలేదు. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్, గుర్నూర్ బ్రార్ తలో మూడు వికెట్లు పడగొట్టి అఫ్గాన్ పతనాన్ని శాసించారు. ప్రిన్స్ యాదవ్ రెండు వికెట్లు దక్కించుకోగా, వాషింగ్టన్ సుందర్‌కు ఒక వికెట్ లభించింది. ఇరు జట్ల మధ్య మూడో వన్డే శనివారం జరగనుంది.

### ఇషాన్‌కు అరుదైన మైలురాయి

ఈ మ్యాచ్‌లో శతకంతో మెరిసిన ఇషాన్ కిషన్ మరో అరుదైన ఘనతను సొంతం చేసుకున్నాడు. వ్యక్తిగతంగా 33 పరుగుల వద్ద వన్డేల్లో వెయ్యి పరుగుల మైలురాయిని చేరుకున్న అతడు, అత్యంత తక్కువ బంతుల్లో ఈ ఘనత సాధించిన భారత ఆటగాళ్ల జాబితాలో నాలుగో స్థానాన్ని దక్కించుకున్నాడు. ఈ మ్యాచ్‌కు ముందు వరకు 28 వన్డేల్లో 967 పరుగులు చేసిన ఇషాన్, మొత్తం 966 బంతుల్లోనే వెయ్యి పరుగులు పూర్తి చేయడం విశేషం. హార్దిక్ పాండ్యా, కేదార్ జాదవ్, కపిల్ దేవ్, శుభ్‌మన్ గిల్, మహేంద్రసింగ్ ధోనీ తర్వాత ఈ జాబితాలో ఇషాన్ కిషన్ చోటు సంపాదించాడు. అదేవిధంగా అఫ్గానిస్థాన్‌పై వన్డేల్లో అత్యంత వేగంగా శతకం సాధించిన బ్యాటర్ల జాబితాలోనూ ఇషాన్ మూడో స్థానంలో నిలిచాడు. ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ ఇయాన్ మోర్గాన్, భారత స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ మాత్రమే అతని కంటే ముందున్నారు. శుభ్‌మన్ గిల్‌తో కలిసి మూడో వికెట్‌కు 224 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పిన ఇషాన్ భారత్ భారీ విజయానికి కీలక పాత్ర పోషించాడు.





## ఫైనల్‌లో భారత్ ఏ

- అఫ్గాన్‌పై 101 పరుగుల తేడాతో విజయం

**దంబుల్లా:** ముక్కోణపు వన్డే సిరీస్‌లో తప్పనిసరిగా గెలవాల్సిన మ్యాచ్‌లో భారత్-ఏ అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంది. బుధవారం అఫ్గానిస్థాన్-ఏతో జరిగిన మ్యాచ్‌లో బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమష్టిగా రాణించిన యువ భారత జట్టు 101 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. ఈ విజయంతో మెరుగైన రన్‌రేట్ ఆధారంగా ఫైనల్ బెర్త్‌ను దాదాపుగా ఖాయం చేసుకుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్-ఏ నిర్ణీత 50 ఓవర్లలో తొమ్మిది వికెట్ల నష్టానికి 319 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. ఓపెనర్ ప్రియాన్ష్ ఆర్య 42 బంతుల్లో తొమ్మిది ఫోర్లు, ఒక సిక్సర్‌తో 58 పరుగులు చేసి వేగంగా ఆడగా, తిలక్ వర్మ 75 బంతుల్లో ఐదు ఫోర్ల సాయంతో 59 పరుగులు సాధించాడు. కుమార్ కుశాగ్ర 67 బంతుల్లో ఐదు ఫోర్లతో 58 పరుగులు చేసి జట్టుకు కీలకమైన ఇన్నింగ్స్ అందించాడు.వైభవ్ సూర్యవంశీ 28 బంతుల్లో 38 పరుగులు, రుతురాజ్ గైక్వాడ్ 30 పరుగులు, విప్రజ్ నిగమ్ 30 పరుగులతో విలువైన సహకారం అందించారు. అఫ్గానిస్థాన్-ఏ బౌలర్లలో ఫరిదూన్, అబ్దుల్లా అహ్మద్‌జై, ఫర్మనుల్లా చెరో రెండు వికెట్లు దక్కించుకోగా, జహీర్ ఖాన్‌కు ఒక వికెట్ లభించింది. 320 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన అఫ్గానిస్థాన్-ఏ 36.5 ఓవర్లలో 218 పరుగులకే కుప్పకూలింది. బహీర్ షా 57 పరుగులతో అర్ధశతకం నమోదు చేయగా, ఫైసల్ 46 పరుగులతో ఫర్వాలేదనిపించాడు. మిగతా బ్యాటర్లు భారత బౌలర్ల ధాటికి నిలవలేకపోయారు. భారత్-ఏ బౌలర్లలో స్పిన్ ఆల్‌రౌండర్ నిశాంత్ సింధు నాలుగు వికెట్లతో అద్భుత ప్రదర్శన కనబరిచి విజయానికి ప్రధాన కారకుడిగా నిలిచాడు. యశ్ ఠాకూర్ రెండు వికెట్లు పడగొట్టగా, అన్షుల్ కంబోజ్, విప్రజ్ నిగమ్, సూర్యాన్ష్ షెడ్గే, అనుకుల్ రాయ్ తలో వికెట్ సాధించారు. ఈ ముక్కోణపు సిరీస్‌లో నాలుగు మ్యాచ్‌ల్లో రెండు విజయాలు సాధించిన భారత్ మెరుగైన రన్‌రేట్‌తో అగ్రస్థానానికి చేరుకుంది.



## మెస్సి హ్యాట్రిక్

- ఫిఫా ప్రపంచకప్‌ను ఘనంగా ఆరంభించిన అర్జెంటీనా
- అల్జీరియాపై 3-0తో విజయం

**కాన్సాస్ సిటీ:** ఫిఫా ప్రపంచకప్‌లో అర్జెంటీనా జట్టు శుభారంభం చేసింది. స్టార్ ఆటగాడు లియోనెల్ మెస్సి హ్యాట్రిక్‌తో మెరిసిపోవడంతో టైటిల్ ఫేవరెట్లలో ఒకటైన అర్జెంటీనా తమ తొలి మ్యాచ్‌లో అల్జీరియాపై 3-0 గోల్స్ తేడాతో ఘన విజయం సాధించింది. మ్యాచ్ ప్రారంభం నుంచే దూకుడుగా ఆడిన అర్జెంటీనా తరఫున మెస్సి 17వ నిమిషంలో తొలి గోల్ సాధించి జట్టుకు ఆధిక్యం అందించాడు. తొలి అర్ధభాగం ముగిసే సమయానికి అర్జెంటీనా 1-0తో ముందంజలో నిలిచింది. రెండో అర్ధభాగంలో మరింత దూకుడుగా ఆడిన మెస్సి 60వ నిమిషంలో మరో గోల్ నమోదు చేశాడు. అనంతరం 76వ నిమిషంలో మూడో గోల్ సాధించి హ్యాట్రిక్‌ను పూర్తి చేశాడు. ప్రపంచకప్ చరిత్రలో మెస్సికి ఇది తొలి హ్యాట్రిక్ కావడం విశేషం. అతడి అద్భుత ప్రదర్శనతో స్టేడియంలోని అభిమానులు లేచి నిలబడి చప్పట్లతో అభినందించారు.

### కంటతడి పెట్టుకున్న స్టార్ ప్లేయర్

మ్యాచ్ అనంతరం లియోనెల్ మెస్సి భావోద్వేగానికి లోనయ్యాడు. విజయానంతరం కంటతడి పెట్టిన మెస్సి, ఆ భావోద్వేగానికి ఫుట్‌బాల్‌తో సంబంధం లేదని స్పష్టం చేశాడు. వ్యక్తిగతంగా గత కొన్ని రోజులుగా తాను కొన్ని ఇబ్బందులను ఎదుర్కొన్నట్లు మ్యాచ్ అనంతర కార్యక్రమంలో వెల్లడించాడు. అయితే ఆ విషయాల గురించి మరింత వివరాలు వెల్లడించలేదు. అద్భుతమైన వ్యక్తిగత ప్రదర్శనతో పాటు జట్టుకు విజయాన్ని అందించిన మెస్సి, ఈ ప్రపంచకప్‌లో అర్జెంటీనా ఆశలను మరింత పెంచాడు.

## నెదర్లాండ్స్‌పై హర్మన్ సేన విజయం

- అర్ధ సెంచరీలతో రాణించిన స్మృతి, షెఫాలీ
- శ్రీ చరణికి నాలుగు వికెట్లు

**లీడ్స్:** మహిళల టీ20 ప్రపంచకప్‌లో భారత జట్టు విజయయాత్రను కొనసాగిస్తోంది. బుధవారం నెదర్లాండ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అన్ని విభాగాల్లోనూ అద్భుత ప్రదర్శన కనబరిచిన టీమిండియా 95 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో భారత మహిళల జట్టు వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 209 పరుగులు చేసింది. ఓపెనర్లు స్మృతి మంధాన (74; 47 బంతుల్లో 11 ఫోర్లు, 1 సిక్స్), షెఫాలి వర్మ (55; 38 బంతుల్లో 10 ఫోర్లు) హాఫ్ సెంచరీలతో మెరిశారు. ఈ జోడీ తొలి వికెట్‌కు 115 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పింది. వీరిద్దరూ రెండో వికెట్‌కు 26 బంతుల్లో 47 పరుగులు జోడించారు. అయితే, స్వల్ప వ్యవధిలోనే మంధాన, జెమీమా, యాస్తికా భాటియా (3) ఔటయ్యారు. చివర్లో రిచా ఘోష్ (20 నాటౌట్; 8 బంతుల్లో 1 ఫోర్, రెండు సిక్స్‌లు), దీప్తి శర్మ (10 నాటౌట్; 2 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్) ఫినిషింగ్ టచ్ ఇవ్వడంతో స్కోరు 200 దాటింది. నెదర్లాండ్స్ బౌలర్లలో కరోలిన్ డి లాంగే 2 వికెట్లు.. హీథర్ సీగర్స్, వాన్ డెన్ రాడ్, ఐరిస్ జ్విల్లింగ్ తలో వికెట్ తీశారు. అనంతరం 210 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన నెదర్లాండ్స్ జట్టు భారత బౌలర్ల ధాటికి 17.3 ఓవర్లలో 114 పరుగులకే ఆలౌటై పరాజయం పాలైంది. నెదర్లాండ్స్ బ్యాటర్లలో బాబెట్ డి లీడే 28 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలవగా, హీథర్ సీగర్స్ 21, స్టెర్రే కాలిస్ 18 పరుగులతో ఫర్వాలేదనిపించారు. మిగతా బ్యాటర్లు భారత బౌలర్లకు ఎదురొడ్డి నిలవలేకపోయారు.

### ఒకే ఓవర్‌లో మూడు వికెట్లు

భారత్ బౌలింగ్ విభాగంలో శ్రీ చరణి అద్భుతంగా రాణించి నాలుగు వికెట్లు పడగొట్టింది. షెఫాలీ వర్మ మూడు వికెట్లు సాధించగా, నందని శర్మ రెండు వికెట్లు దక్కించుకుంది. దీప్తి శర్మకు ఒక వికెట్ లభించింది. మ్యాచ్ చివరి దశలో భారత బౌలర్లు మరింత దూకుడుగా బౌలింగ్ చేశారు.

17వ ఓవర్‌లో శ్రీ చర ణి మూడు వికెట్లు పడగొట్టి నెదర్లాండ్స్ పతనాన్ని శాసించగా, 18వ ఓవర్‌లో షెఫాలీ వర్మ రెండు వికెట్లు తీసి ప్రత్యర్థి ఇన్నింగ్స్‌కు తెరదించింది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమష్టిగా రాణించిన భారత మహిళల జట్టు టోర్నీలో తమ ఆధిపత్యాన్ని మరోసారి చాటింది.





## జియో ఐపీఓకు రంగం సిద్ధం

- ఈ వారమే సెబీకి ముసాయిదా పత్రాల సమర్పణకు అవకాశం
- రూ.40 వేల కోట్ల వరకు నిధుల సమీకరణే లక్ష్యం
- రిలయన్స్ వార్షిక సర్వసభ్య సమావేశంలో కీలక ప్రకటనలపై ఆసక్తి

**ముంబై:** రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన టెలికాం విభాగం జియో ఇన్ఫోకామ్ తొలి పబ్లిక్ ఇష్యూకు రంగం సిద్ధమవుతోంది. మార్కెట్‌లో నెలకొన్న ప్రతికూల పరిస్థితుల కారణంగా ఆలస్యమైన ఈ ఐపీఓ ప్రక్రియ త్వరలో వేగం పుంజుకోనుంది. ఈ మేరకు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీకి ఈ వారంలోనే ముసాయిదా పత్రాలను సమర్పించే అవకాశం ఉందని అంతర్జాతీయ ఆర్థిక పత్రిక 'ఫైనాన్షియల్ టైమ్స్' వెల్లడించింది. ఈనెల 19న జరగనున్న రిలయన్స్ ఇండస్ట్రీస్ వార్షిక సర్వసభ్య సమావేశానికి ముందే డ్రాఫ్ట్ పత్రాలను సెబీకి సమర్పించే అవకాశమున్నట్లు ఆ కథనం పేర్కొంది. ఈ ఐపీఓ ద్వారా సుమారు 4 బిలియన్ డాలర్లు, అంటే రూ.36 వేల కోట్ల నుంచి రూ.40 వేల కోట్ల వరకు నిధులను సమీకరించాలని సంస్థ భావిస్తున్నట్లు సమాచారం. గత ఏడాది జరిగిన రిలయన్స్ వార్షిక సర్వసభ్య సమావేశంలో జియో ఐపీఓపై రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ ప్రకటన చేశారు. 2026 తొలి అర్ధభాగంలో జియో పబ్లిక్ ఇష్యూ చేపట్టనున్నట్లు ఆయన అప్పట్లో వెల్లడించారు. అయితే, ఈ ఏడాదిలో ఇప్పటివరకు రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు విలువ దాదాపు 15 శాతం మేర క్షీణించడం, పశ్చిమాసియా ఉద్రిక్తతల ప్రభావంతో సంస్థ ప్రధాన ఆదాయ వనరైన పెట్రోకెమికల్ వ్యాపారం మందగించడం వల్ల లాభాల్లో 13 శాతం తగ్గుదల నమోదైంది.

మరోవైపు మార్కెట్ ఒడుదొడుకుల కారణంగా తొలి పబ్లిక్ ఇష్యూల మార్కెట్ కూడా కొంతకాలంగా మందగించింది. అయితే ప్రస్తుతం పరిస్థితులు క్రమంగా మెరుగుప డుతుండటంతో జియోతో పాటు పలు కంపెనీలు ఐపీఓ ప్రణాళికలను వేగవంతం చేస్తున్నాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ వార్షిక సర్వసభ్య సమావేశం ఈ శుక్రవారం జరగనుంది. ఈ సమావేశంలో జియో ఐపీఓపై మరింత స్పష్టత వచ్చే అవకాశ ముందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.




## హైదరాబాద్‌లో టెస్లా

- మాదాపూర్‌లో ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ప్రారంభం
- 2026 మోడల్ వై వాహనాల ప్రదర్శన
- బొల్లారంలో సేవా కేంద్రం ఏర్పాటు

**ప్రజానావ, హైదరాబాద్:** ప్రపంచ ప్రఖ్యాత విద్యుత్ వాహనాల తయారీ సంస్థ టెస్లా హైదరాబాద్‌లో తన తొలి ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. మాదాపూర్‌లోని హైటెక్ సిటీలో ప్రారంభమైన ఈ కేంద్రంలో సంస్థకు చెందిన 2026 మోడల్ వై ప్రీమియమ్ రియర్ వీల్ డ్రైవ్ , మోడల్ వైఎల్ వాహనాలను వినియోగదారులు ప్రత్యక్షంగా పరిశీలించేందుకు అవకాశం కల్పించింది. ఈ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌లో టెస్లా వాహనాల్లో ఉపయోగిస్తున్న అత్యాధునిక సాంకేతికత, భద్రతా ఫీచర్లు, పనితీరు తదితర అంశాలను సందర్శకులు తెలుసుకునే వీలుందని సంస్థ వెల్లడించింది. వినియోగదారులకు సమగ్ర అనుభూ తిని అందించడమే లక్ష్యంగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపింది.

అదేవిధంగా, నగర శివారులోని బొల్లారం పారిశ్రామిక ప్రాంతంలో డెలివరీతో పాటు విక్రయానంతర సేవల కోసం ప్రత్యేక కేంద్రాన్ని కూడా టెస్లా ఏర్పాటు చేసింది. వాహనాల పంపిణీ, నిర్వహణ సేవలు, సాంకేతిక సహాయం వంటి సదుపాయాలను ఈ కేంద్రం ద్వారా అందించనుంది. ఇప్పటికే బెంగళూరు, ముంబయి, ఢిల్లీ, గురుగ్రామ్‌లలో టెస్లా ఎక్స్‌పీరియన్స్ సెంటర్లను నెలకొల్పిన సంస్థ.. హైదరాబాద్‌లో ప్రారంభించిన ఈ కేంద్రంతో దేశంలో మొత్తం ఐదు ఎక్స్‌పీరియన్స్ సెంటర్లను కలిగి ఉండడం విశేషం. భారత మార్కెట్‌లో తన ఉనికిని మరింత విస్తరించేందుకు టెస్లా వేగంగా అడుగులు వేస్తోందని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి.

## వరుసగా నాలుగో రోజు!

- లాభాల్లో ముగిసిన మార్కెట్లు
- 347 పాయింట్లు ఎగిసిన సెన్సెక్స్.. 24,085 పైన నిఫ్టీ స్థిరీకరణ

**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా నాలుగో రోజు లాభాలతో ముగిశాయి. మెటల్, పీఎస్‌యూ, కన్స్యూమర్ డ్యూరబుల్స్ రంగాలకు చెందిన షేర్లలో కొనుగోళ్లు పెరగడంతో సూచీలు బలంగా నిలిచాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల నిర్ణయాన్ని మదుపర్లు ఆసక్తిగా ఎదురుచూస్తున్న నేపథ్యంలో మార్కెట్‌లో అప్రమత్త ధోరణి కనిపించింది. ఈ నేపథ్యంలో బీఎస్‌ఈ సెన్సెక్స్ 347.14 పాయింట్లు పెరిగి 77,155.62 వద్ద ముగియగా, ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 96.55 పాయింట్లు లాభపడి 24,085.70 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్-30 సూచీలో ట్రెంట్, బీఈఎల్, ఎటర్నల్, టాటా స్టీల్, ఇన్ఫోసిస్ షేర్లు లాభాల్లో నిలిచాయి. మరోవైపు బజాజ్ ఫిన్‌సర్వ్, యాక్సిస్ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా, మారుతీ సుజుకీ షేర్లు నష్టాలను చవిచూశాయి. అంతర్జాతీయ మార్కెట్లలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 79 డాలర్ల వద్ద కొనసాగుతుండగా, బంగారం ఔన్సు ధర 4,329 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ రూ. 94.52గా నమోదైంది.

### టాటా మోటార్స్‌కు ఎదురుదెబ్బ

టాటా మోటార్స్ ప్యాసింజర్ వాహన విభాగం షేర్లు నేడు తీవ్ర అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఒక దశలో 10 శాతం వరకు పతనమైన ఈ షేరు, చివరకు 8.10 శాతం నష్టంతో రూ.361.70 వద్ద ముగిసింది. టాటా గ్రూప్‌కు చెందిన లగ్జరీ కార్ల బ్రాండ్ జాగ్వార్ ల్యాండ్ రోవర్ భవిష్యత్ వృద్ధిపై సంస్థ వెల్లడించిన అంచనాలు, యాజమాన్యం వ్యాఖ్యలు ఇన్వెస్టర్లను నిరాశకు గురిచేయడంతో ఈ ప్రభావం టాటా మోటార్స్ షేర్లపై పడింది.

### ఐడీబీఐ బ్యాంక్‌కు జోష్

ఐడీబీఐ బ్యాంక్ షేర్లు నేడు భారీ లాభాలను నమోదు చేశాయి. వ్యూహాత్మక వాటాల విక్రయానికి కేంద్రం వేగం పెంచిందన్న వార్తలు, వచ్చే ఆర్థిక సంవత్సరానికల్లా పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియ పూర్తయ్యే అవకాశాలపై వచ్చిన సంకేతాలతో షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఒక దశలో 18 శాతం వరకు ఎగిసిన ఈ షేరు, చివరకు 16 శాతం లాభంతో రూ.89.60 వద్ద ముగిసింది.

# సంక్రాంతి రేసులో మల్టీస్టారర్ చిత్రం



వరుస విజయాలతో టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు అనిల్ రావిపూడి, మరో క్రేజీ ప్రాజెక్ట్‌కు సిద్ధమవుతున్నారు. విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్‌రామ్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కనున్న ఈ మల్టీస్టారర్ చిత్రంపై ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్నాయి. సినీ వర్గాల సమాచారం ప్రకారం, ఈ చిత్రాన్ని జూన్ 18న అధికారికంగా ప్రారంభించనున్నారు. అనంతరం జూన్ 22 నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. చిత్రీకరణను వేగంగా పూర్తి చేసి అక్టోబర్ లేదా నవంబర్ నాటికి మొత్తం షూటింగ్ ముగించేలా దర్శకుడు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని సమాచారం. ఈ సినిమాలో కీర్తి సురేష్, కృతి శెట్టి కథానాయికలుగా నటించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. అలాగే వెంకటేష్ జూలై నుంచి నిరంతరాయంగా షూటింగ్‌లో పాల్గొనే అవకాశముందని సినీ వర్గాలు చెబుతున్నాయి. సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంగీత దర్శకుడు జి.వి. ప్రకాష్ కుమార్ స్వరాలు సమకూరుస్తున్నారు. ఇప్పటికే కొన్ని ట్యూన్స్ కూడా సిద్ధం చేసినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా, ఈ సినిమాకు 'జనవరి 13 విడుదల' అనే ఆసక్తికర టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు టాలీవుడ్‌లో ప్రచారం జరుగుతోంది. అయితే ఈ టైటిల్‌తో పాటు ఇతర వివరాలపై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే వినోదాత్మక కథాంశంతో రూపొందనున్న ఈ చిత్రాన్ని సంక్రాంతి 2027 కానుకగా విడుదల చేయాలని మేకర్స్ భావిస్తున్నట్లు తెలుస్తోంది.

## మహేష్ సినిమాపై ఆసక్తికర చర్చలు

సూపర్ స్టార్ మహేష్ బాబు ప్రస్తుతం దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న భారీ ప్రాజెక్ట్‌తో బిజీగా ఉన్నారు. పాన్ వరల్డ్ స్థాయిలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఇప్పటికే దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. మహేష్ కెరీర్‌లో 29వ చిత్రంగా రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్ ఆయనను అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు తెచ్చిపెడుతుందని అభిమానులు ఆశిస్తున్నారు. ఇదిలా ఉండగా, మహేష్ బాబు తదుపరి చిత్రం, అంటే ఆయన కెరీర్‌లో 30వ సినిమాపై ఇప్పటికే సినీ వర్గాల్లో చర్చలు మొదలయ్యాయి. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ కోసం పలువురు దర్శకుల పేర్లు వినిపిస్తున్నప్పటికీ, ప్రస్తుతం దర్శకుడు సందీప్ రెడ్డి వంగా, 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. సందీప్ రెడ్డి వంగా తన ప్రత్యేక శైలిలో రూపొందించే సినిమాలతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందగా, బుచ్చిబాబు కూడా వరుసగా క్రేజీ ప్రాజెక్టులతో ప్రేక్షకులను ఆకట్టుకుంటు న్నారు. దీంతో మహేష్ తదుపరి సినిమా ఈ ఇద్దరు దర్శకుల్లో ఒకరితో ఉండే అవకాశాలు ఉన్నాయనే ప్రచారం జరుగుతోంది. అంతేకాకుండా, మహేష్–సందీప్ వంగా కాంబినేషన్‌లో సినిమా రూపొందితే భారీ స్థాయిలో ఉండే అవకాశం ఉందని, ఇప్పటికే పలువురు ప్రముఖ నిర్మాతలు ఆసక్తి చూపుతు న్నట్లు సినీ వర్గాల్లో వార్తలు వినిపిస్తున్నాయి. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడ లేదు. దీంతో మహేష్ బాబు 30వ చిత్రాన్ని ఏ దర్శకుడు తెరకెక్కిస్తారనే అంశం టాలీవుడ్‌లో హాట్ టాపిక్.

# కంగనా 'భారత్ భాగ్య విధాత'కు ఎదురుదెబ్బ!



బాలీవుడ్ నటి కంగనా రనౌత్ ప్రధాన పాత్రలో నటించిన 'భారత్ భాగ్య విధాత' చిత్రం బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో రాణించలేకపోతోంది. 2008 ముంబై ఉగ్రదాడుల నేపథ్యంలో నిజ జీవిత సంఘటనల ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రానికి విమర్శకుల నుంచి ప్రశంసలు లభించినప్పటికీ, ప్రేక్షకాదరణ మాత్రం పరిమితంగానే కనిపిస్తోంది. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం, నాలుగో రోజు ఈ చిత్రం సుమారు రూ.65 లక్షల నెట్ కలెక్షన్లు మాత్రమే సాధించింది. ఆదివారం నమోదైన వసూళ్లతో పోలిస్తే ఇది గణనీయమైన తగ్గుదలగా పేర్కొంటున్నారు. మొత్తంగా తొలి నాలుగు రోజుల్లో దేశవ్యాప్తంగా ఈ చిత్రం రూ.4.9 కోట్ల నెట్ వసూళ్లు సాధించినట్లు ట్రేడ్ అంచనాలు సూచిస్తున్నాయి. కంగనా గత చిత్రం 'ఎమర్జెన్సీ'తో పోలిస్తే ఈ సినిమా వసూళ్లు తక్కువగా ఉన్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇదే సమయంలో విడుదలైన ఇతర చిత్రాలు కూడా పోటీగా నిలవడంతో 'భారత్ భాగ్య విధాత' బాక్సాఫీస్ ప్రయాణం మరింత కఠినంగా మారిందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. ముందున్న వారాంతాల్లో ఈ చిత్రం మెరుగైన వసూళ్లు నమోదు చేస్తుందా లేదా అనేది ఆసక్తికరంగా మారింది. అయితే ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తే సినిమా బాక్సాఫీస్ వద్ద పుంజుకోవాలంటే బలమైన మౌత్ పబ్లిసిటీ అవసరమని విశ్లేషకులు చెబుతున్నారు.

## స్టార్‌డమ్‌తో అహంకారం పెరిగింది..

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత ప్రస్తుతం 'మా ఇంటి బంగారం' చిత్ర ప్రమోషన్ కార్యక్రమాల్లో బిజీగా ఉన్నారు. తన సొంత నిర్మాణ సంస్థలో రూపొందిన ఈ చిత్రం జూన్ 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో వరుస ఇంటర్వ్యూల్లో పాల్గొంటున్న సమంత తన సినీ ప్రయాణానికి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను పంచుకుంటున్నారు. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, కెరీర్ ప్రారంభ దశలో వరుస విజయాలు తనలో ఆత్మవిశ్వాసంతో పాటు కొంత అహంకారాన్ని కూడా పెంచాయని సమంత వెల్లడించారు. ఒకే ఏడాదిలో పలు విజయవంతమైన చిత్రాల్లో నటించడంతో పరిశ్రమలో తనను 'గోల్డెన్ లెగ్' అని పిలిచేవారని గుర్తు చేసుకున్నారు. వరుస విజయాల కారణంగా తనపై అంచనాలు, ఒత్తిడి కూడా పెరిగాయని, ఆ సమయంలో మరిన్ని సినిమాలు చేయాలనే ఆలోచనతో ముందుకు సాగానని తెలిపారు. అయితే జీవితం లో ఎదురైన అనారోగ్య సమస్యలు, కొంతకాలం సినిమాలకు దూరంగా ఉండాల్సిన పరిస్థితులు తన ఆలోచనా విధానాన్ని పూర్తిగా మార్చేశాయని సమంత పేర్కొన్నారు.



## ట్రోల్స్‌కు యాంకర్ కౌంటర్



యాంకర్, నటి విష్ణుప్రియ మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారారు. ఇటీవల ఓ ప్రత్యేక లైవ్ సెషన్‌లో ఆమె చేసిన వ్యక్తిగత వ్యాఖ్యలు సోషల్ మీడియాలో విస్తృత చర్చకు దారితీశాయి. ఈ వ్యాఖ్యలపై నెటిజన్ల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. విష్ణుప్రియ తన అభిమానులతో నిర్వహించిన లైవ్ ఇంటరాక్షన్‌లో కొన్ని వ్యక్తిగత విషయాలను పంచుకోవడంతో ఆ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దీంతో ఆమె వ్యాఖ్యలపై కొందరు విమర్శలు చేయగా, మరికొందరు ఆమె నిజాయితీని సమర్థిస్తున్నారు. ఈ నేపథ్యంలో సోషల్ మీడియాలో వస్తున్న విమర్శలకు విష్ణుప్రియ స్పందించారు. తన అభిప్రాయాలను నిజాయితీగా వెల్లడించడంలో ఎలాంటి తప్పు లేదని, ఇతరుల అభిప్రాయాల కంటే తన వ్యక్తిగత నిర్ణయాలకు ప్రాధాన్యం ఇస్తానని ఆమె సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. అలాగే తన జీవితానికి సంబంధించిన విషయాల్లో తాను ఎప్పుడూ నిజాయితీగా ఉండటానికే ప్రాధాన్యం ఇస్తానని, ఇతరుల కోసం తన వ్యక్తిత్వాన్ని మార్చుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. విష్ణుప్రియ చేసిన వ్యాఖ్యలు, వాటిపై వచ్చిన స్పందనలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విస్తృత చర్చకు కారణమయ్యాయి. అయితే ఈ వివాదం ఇంకా ఎలాంటి మలుపులు తిరుగుతుందో చూడాల్సి ఉంది.

# శర్వానంద్ సరసన ప్రీతి ముకుందన్?

ఛార్మింగ్ స్టార్ శర్వానంద్ ప్రస్తుతం దర్శకుడు సంపత్ నంది తెరకెక్కిస్తున్న 'భోగి' చిత్రంతో బిజీగా ఉన్నారు. ఈ సినిమాను ఆగస్టు 28న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది. ఈ చిత్రం పూర్తయ్యాక శర్వానంద్ తన తదుపరి ప్రాజెక్ట్‌ను దర్శకుడు శ్రీను వైట్లతో ప్రారంభించనున్నట్లు సమాచారం. అవుట్ అండ్ అవుట్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందనున్న ఈ సినిమాకు సంబంధించిన ప్రీ–ప్రొడక్షన్ పనులు ప్రస్తుతం చివరి దశలో ఉన్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. అలాగే ఈ చిత్రానికి 'జార్జ్ క్రిష్' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇదిలా ఉండగా, ఈ సినిమాలో శర్వానంద్ సరసన యంగ్ హీరోయిన్ ప్రీతి ముకుందన్ నటించనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. 'కన్నప్ప' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ప్రీతి ముకుందన్, ఇటీవల పలు ప్రాజెక్టులతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఇప్పుడు ఆమె శర్వానంద్‌తో జతకట్టనున్నారనే ప్రచారం సినీ అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాత అనిల్ సుంకర నిర్మించనున్నట్లు సమాచారం. ఆగస్టు నెలలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించేలా మేకర్స్ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని తెలుస్తోంది. శర్వానంద్–శ్రీను వైట్ల కాంబినేషన్‌లో రూపొందనున్న ఈ ఎంటర్‌టైనర్‌ను వచ్చే ఏడాది సంక్రాంతి సందర్భంగా విడుదల చేయాలని భావిస్తున్నట్లు టాలీవుడ్ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన నటీనటులు, విడుదల తేదీ వంటి అంశాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.



Printed, Published and Owned by Adula Thirupathi, Printed at Ramani Web Offset Printers, H.No 8-82/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, Published from 2-5-23, Mudhiraj street, Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. Editor: Adula Thirupathi. Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277. RNI NO: TELTEL/2023/87657